శ్రీ

దాసరాజు రామారావు కవిత్వం

పట్టుకుచ్చుల పువ్వు

దాసరాజు రామారావు

కవిత్వం

పట్టుకుచ్చుల పువ్వు



మంజీరా రచయితల సంఘం

pattukuchula puvvu

Poetry

by dasaraju ramarao

Published by

Manjeera Rachayitala Sangam

First Edition : August 2012

Design, Book Making : Jugashvili

Title Photo : Dr. S. Laxmana Swamy

DTP & Layout : Sowmya Graphics, Hyderabad.

Printed at Charita Impressions, Hyderabad.

For Copies :

D. Vijayalakshmi

H.No.13-30/79, Sai Bagavan Colony,
BHEL - Ramachandrapuram,
Medak Dist - 502 032.
Email : daasaraju@gmail.com

Cell : 9618224503

and

Visalandhra, Sahachara,
Disha, Palapitta, Navodaya, Samantara

ebook : www.kinige.com

Price : Rs. 50/-

‘బతికినం’ అనిపించిన
అమ్మ లక్ష్మీబాయి
బాపు రామచందర్‌రావు లకు...

శనార్తులు

- వరవరరావు గారికి వినమ్రంగా ...
- డా॥ నందిని సిధారెడ్డి
  డా॥ నాళేశ్వరం శంకరం
  దేశపతి శ్రీనివాస్
  డా॥ ఎస్. లక్ష్మణస్వామి
  జుగాష్ విలి
  వఝుల శివకుమార్
  వేముగంటి మురళీకృష్ణ
  టి.కృష్ణమూర్తి యాదవ్ లకు ఆత్మీయంగా ...
- కవితలను ప్రచురించిన ఆయా పత్రికాధిపతులకు,
  అంతర్జాల పత్రికల సంపాదక వర్గాలకు,
  సంకలనకర్తలకు గౌరవంగా ...
- మ.ర.సం, వి.ర.సం, తె.ర.వే, సింగిడి సాహిత్య సంస్థలకు, టి.ఎన్.జి.ఓ., పాత్రికేయ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలకు ప్రేమగా ...
- సౌమ్య గ్రాఫిక్స్, అంకుష్ గ్రాఫిక్స్, చరిత ఇంప్రెషన్స్ వారికి మర్యాదగా ...

  ఇంకా...

- పేగు బంధాన్ని కదిలిస్తోన్న నెల్లుట్ల శ్రీహన్ కార్తికేయ (చిట్టి మనుమడు – USA)కి అన్ని తీర్లుగా ...

కుచ్చుల తీరు ...

'కవిత్వమైనవాడు...'

ఇది దాసరాజు రామారావుగారి రెండవ కవితా సంకలనం. మొదటిది చాలా ఆలస్యంగా 2001లో వెలువడింది. మళ్ళీ పదకొండేళ్ళ ఆలస్యంతో ఈ సంకలనం వెలువడుతుంది. మొదటి సంకలనం పేరు 'గోరుకొయ్యలు'. గోరుకొయ్యలను చూసి రైతు నాగళ్లు తీసుకుని పొలానికి బయలు దేరుతాడు. వ్యవసాయ జీవితానికి నిజానికి గోరుకొయ్యలు కనిపించడమే ఏగిలివారడం. మరి ఇంకో దశాబ్దం పైగా గడిచిన తరువాత భళ్ళున తెల్లవారాలి కదా! కాని ఈ కవితా సంకలనం చదివినా, ఈ పదకొండేళ్ళ భారత చిత్రపటం చూసినా ఆ మాట కొస్తే భూగోళం మీదనే భూమితో సంబంధమున్న ఏ మనిషి జీవితంలోను తెల్లవారినట్టు లేదు. తెల్లవారకపోవడమే కాదు, ప్రతి రాత్రి ఒక ఉదయాన్ని హామీ పడుతున్నదని, ఆశాజీవి అయిన కవి రాస్తూ ఉంటాడు కానీ మనుషుల జీవితాల్లోని వెన్నెలకు గ్రహణం పట్టి నక్షత్రాలు కొడిగట్టే విధ్వంస పర్యావరణమేదో నిద్రలేని రాత్రులు 1991 నుంచి ఆవరిస్తూ వ్యాపిస్తూ పోతున్నాయి. అయితే ఇంకా తెల్లవారక పోయినా గోరుకొయ్యల తరువాత ఇది ఉదయ సంధ్య. సాయం సంధ్య కాకపోవడమే ఒక గొప్ప ఆశా సంకేతం. మొత్తంగా చూసినపుడు ఇందులోని కవితలను ఒకే ఒక్క వస్తుకేంద్రంగా చెప్పాలనుకున్నప్పుడు ఇవన్నీ మనిషిలోని మనిషితనం పరాయీకరింపబడడం గురించి పడిన ఆవేదనను, మనిషి అస్థిపంజరంలోకి సజీవ సంచలన రక్తమాంసాలను మళ్ళీ ప్రోది చేసి మనిషితనాన్నీ, మంచితనాన్నీ ఆవిష్కరించాలన్న గాఢమైన ఆకాంక్ష. శిల్పపరంగా చెప్పాలనప్పుడు కవితలన్నింటిలోనూ ఒక సుకుమారమైన సున్నితమైన భావశబలత, ఎటువంటి గడ్డు రోజుల్లోను సమతాసుందర భవిష్యత్ స్వప్నాలను చూడగల ఊహ, కవితోహ పరుచుకుని ఉంటుంది.

ఈ ముప్పై ఎనిమిది కవితల్లో పద్నాల్గు కవితలు తెలంగాణపైన ఉన్నవే. ఇవన్నీ 2007–2011 మధ్యన రాసినవి. కాని మొదటి కవితా సంకలనం వెలువడిన 2001 నుంచి 2011 వరకు తెలంగాణ చిత్రపటాన్ని ఇందులో చూడవచ్చు.

2001కు ఉన్న ప్రత్యేకత ఏమిటి? మామూలుగానైతే తెలంగాణ రాష్ట్ర సాధన కోసమే ప్రత్యేకించి ఒక రాజకీయ పార్టీ ఏర్పడిందని చెప్పవచ్చు. కాని అంతమాత్రమే కాదు ఎన్.టి.రామారావు తొంభైనాలుగు చివరలో అధికారానికి వచ్చి చంద్రబాబు నాయుడు ఆర్థిక మంత్రి అయిన నాటి నుంచి హైదరాబాదు సచివాలయంలో ప్రపంచ బ్యాంకు సలహా మండలి బృందమొకటి పని చేయడం ప్రారంభించింది. అది కుప్పంలో ఇజ్రాయిల్ పద్ధతి సాగు గురించి మాత్రమే చెప్పలేదు, హైదరాబాదు చుట్టూ ఉన్న జిల్లాల్లో ముఖ్యంగా నలగొండ, మెదక్ జిల్లాల్లో విధ్వంస కార్యక్రమం గురించి కూడా చెప్పింది. మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల వరకు వ్యాపించిన పబ్లిక్ రంగ పరిశ్రమలను మూసివేయడమో, ప్రైవేట్ రంగానికి అప్పగించడమో అమలు చేయడం ప్రారంభించింది. ముఖ్యంగా పతాన్‌చెరు నుంచి సంగారెడ్డి వరకు పరిశ్రమలను ఖాయిలాపడ చేసి, కార్మిక సంఘాలను అణచివేతకు గురి చేసి, కార్మిక నాయకులను ఎన్‌కౌంటర్ చేసి భీభత్సం సృష్టించింది. మెదక్ జిల్లావాడైన కవికి ఇది ప్రత్యక్షానుభవం. కనుక ఈ విధ్వంసానికి చంద్రబాబు ఆర్థిక మంత్రిగా ఉండడం ఇరుకైపోయింది. అందుకే వైస్‌రాయి కుట్రతో తొంభై ఐదు ఆగస్టులో ఆయన ఎన్.టి.ఆర్.ను వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి అయ్యాడు. ఇంకా అక్కడ నుంచి ఆయన చెప్పుకున్నట్లు ఆయన సి.యం.గా కాదు, ప్రపంచ బ్యాంకు సి.ఇ.ఓ గా వ్యవహరించాడు. అక్కడి నుంచి 2001 నాటికి ప్రపంచ బ్యాంకు అభివృద్ధి నమూనాయేమిటో తెలుగు నేల మీద ముఖ్యంగా ప్రపంచ బ్యాంకు ప్రయోగశాలగా మారిన తెలంగాణలో ప్రజలకు చేదు అనుభవమయింది. 2001 గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ఇటు టిడిపి కి అటు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగాను, కొత్తగా ఏర్పడిన తె.రా.స కు అనుకూలంగా ఓటువేసి ప్రజలు తెలంగాణా ఆకాంక్షను మాత్రమే కాదు, ప్రపంచ బ్యాంకు నమూనా పట్ల నిరసనను కూడా వ్యక్తం చేశారు. 2004 ఎన్నికల్లో చంద్రబాబు భాషలోనే మూడు అంశాలలో రెఫరెండమయింది. ప్రపంచ బ్యాంకు నమూనాను నిరాకరించడం, నక్సలైట్స్‌తో భేషరతుగా చర్చలు జరపడం, తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడం. తె.రా.స ఎన్నికల వాగ్దానం ప్రకారమైతే నక్సల్ ఎజెండానే తమ ఎజెండాగా అమలు చేయడం, 2001–2004 నేపథ్యం ఇందులోని తెలంగాణ కవితల్లో మనం స్పష్టంగా చూడొచ్చు.

ఆకాశంలో గోరుకొయ్యల పొద్దు కాడ
చుక్కలు మబ్బులు కలగలిసి
తెలంగాణా రాష్ట్రాన్ని బొమ్మ కట్టిస్తయి
చెట్లమీద పిట్టలు
రాష్ట్ర గీతాన్ని ఆలపిస్తయ్

గోరటి ఎంకన్న ఇండియా పాకిస్తాన్ లాగా విడిపోతమా అన్న వ్యక్తీకరణ కన్న సహజ ధోరణిలో –

కలిసి కుట్టేసుకుని ఉంటిమా
విడిచి బ్రహ్మజెముడు తీరాలకు
విసిరేయబడి పోతమా

కవి సమయం లాంటిదే మీ ప్రేమ సమయం అంటాడు.

2007–2011 మధ్యన జరిగిన ఒక కీలకమైన పరిణామం 2009 డిసెంబర్ 9న కేంద్ర ప్రభుత్వం నుండి ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రకటన. 2009 నవంబర్ 29 తో ప్రారంభమై తెలంగాణలో జరిగిన ముఖ్యంగా క్యాంపస్‌లో జరిగిన పోరాటం రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ప్రపంచాన్ని ఊపేసిన పది రోజుల వలె ఒక అపూర్వమైన పోరాట ఘట్టం. ఆ పోరాట వెల్లువకు తలవంచినదే డిసెంబర్ 9 అర్ధరాత్రి తెలంగాణ ప్రకటన. అది అర్ధరాత్రి ప్రకటన అని వివిధ రకాల వెక్కిరింపులు వచ్చినపుడు కవి ముఖ్యంగా గోరుకొయ్యలు రాసిన కవి "తెల్లారేదెట్ల' అని ఒక కవిత రాశాడు. అందులో ప్రకృతిని మాత్రమే ఆలంబనగా తీసుకోలేదు. ప్రత్యక్షంగా చెప్పకపోయినా చరిత్ర అవగాహనలోకి వెళ్లాడు. బ్రిటిష్ ఇండియా నుంచి ఇంగ్లీషు పరిపాలన కూడా ఆగస్టు 14 అర్ధరాత్రే ముగిసింది.

కాల సంస్కారం లోంచి
అర్ధరాత్రిని వెలివేసింద్రా
పురిటినొప్పుల్లోంచి పొలికేకపెట్టే ఉషస్తారకు
పురుడు పోసేది అర్ధరాత్రి ఆరాటమే

తెలంగాణ కవితలు కూడ పరాయికరణ పట్ల ఆవేదనలో భాగమే. కేవలం ఒక భౌగోళిక ఆకాంక్ష కాదు. ఒక పరిపాలనాధికార ఆసక్తే కాదు. పరిపాలన అన్నప్పుడు

ఆధిక్యభావన లేని ప్రజాపాలన కవి ఆకాంక్ష. కవి గనుక సహజంగానే ఇది భాషాపరంగా సాంస్కృతికంగా వ్యక్తమవుతుంది. 'తెలంగాణ బడిగావాలె' అనే కవిత మొత్తం ఒక అద్భుతమైన ఉదాహరణ.

అరక, ఇల్లు, ఐరావతం
అంటూ చక్కటి బొమ్మలతో
బోధ చేస్తున్నప్పుడు
అవ్వ, గుడిసె, ఎద్దు
తడి ఊరిన పిల్లల కళ్ళల్లో కనిపిస్తయి
మూగగా ప్రశ్నిస్తయి

ఆంధ్రప్రదేశ్ పటం వాళ్ళకు అర్థం కాదు. ఐదు నిమిషాల్లో వాళ్ళ ఊరి నక్షా గీయగలరు. మధ్యాహ్న భోజనం చాలలేదని ఫిర్యాదు చేసే ఆకలి డొక్కలకు అన్నపూర్ణ 'రత్నగర్భ' అనే ఆంధ్రరాష్ట్రం మాటలు ఎంత క్రూరమైన హాస్యం.

పంతులు స్థితి మాత్రమేమిటి? అపెప్, డిపెప్, క్లిప్, క్లాప్, లెప్పు ఇవి ఉపాధ్యాయుని పరకాయ ప్రవేశాలు. కనుక పిల్లలకు

సారు మన సారుకాదు
పుస్తకాలు ఇసప్పురుగులే
ఈ బడి మాకొద్దు

ఐతే ఇవాళ్ళ తెలంగాణ ఉద్యమం ఏది మాత్రమో మాత్రమే చెప్పడం లేదు. ముఖ్యంగా విద్యార్థులు తమకు ఏం కావాలో కూడా చెబుతున్నారు. స్కూల్ పోస్టుబాక్స్‌ల్లోని ఉత్తరాల్లో, గోడపత్రికల్లో, డైరీల్లో తెలంగాణ బడి కావాలని డిమాండ్ చేస్తున్నారు.

కమిటీలు, ఒప్పందాలు వంటి విషయాలను కూడా ఒక వార్తగా ఒక వ్యాఖ్యగా ఒక ప్రకటన వలె గాకుండగా ఒక కవితాత్మకంగా మలచడం కూడా ఈ కవికి తెలుసు. తెలంగాణ భావన తన మనసులోకే కాదు తన హృదయంలోకి కూడా ఒక భావోద్వేగంగా ఇంకినప్పుడే ఇది సాధ్యమవుతుంది.

ఒప్పందాలకు కాల దోషం పట్టించింద్రు
మనసులకు గుణ దోషం తగిలిచ్చుకున్నరు

1956 పెద్ద మనుషుల ఒప్పందం నుంచి డిసెంబర్ 9 ప్రకటన వరకు ఒక విశ్వజనీనమైన సాధారణీకరణ.

ఆకాశం దిగిరాదు

నేల ఎగబాకదు

పంటికింద పల్లిగింజ

నయాకృష్ణగీత

నాన్చుడు, త్రేన్చుడు

శ్రీకృష్ణ కమిటీ మీద ఈ వ్యాఖ్య సమస్యను నాన్చే మేనేజ్‌మెంట్ పద్ధతులనే కాదు, తెలంగాణ ప్రజల ఆకాంక్షలను తిని త్రేంచే నిర్బంధ పరిస్థితులను కూడా నర్మ గర్భితంగా వ్యక్తం చేస్తుంది.

'చెర్వొక కల'లో ఒక తెలంగాణ ప్రత్యేకత ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో చెరువులు కోల్పోయిన అన్ని ప్రాంతాలకు వర్తిస్తుంది.

అలలు ఎగిరిపోయిన జాడల కోసం

కలల కలవర పాటు

మెడకు తాడేసి బల్మీటికి గుంజుకపోయినట్లు

పల్లె కడుపు పట్టన పగిలిన గోలెమే

ఈ చెరువు దగ్గర నుంచి ఈ పల్లెలోనే వచ్చిన

కిన్లే వాటర్ బాటిల్‌ను చూస్తున్నవా

నాకేమనిపిస్తుందో చెప్పనా

బంగారు పంజరంలో బందీ అయిన మన ఊరి చెరువులా లేదూ

తెలంగాణపై నిండయిన కవిత మా చరిత్ర మాకు కావాలని కొండాపురం మ్యూజియం సందర్శనానుభవంతో రాసిన కవిత. ఆయనకు కొండాపురంకోట

మనకు దీవెనార్తి పలకడానికి

చెయ్యి ఎత్తిపట్టే ఉంచి

గంటం చేసే శబ్దాలతో గుణాఢ్యుడు ఆలపిస్తున్నట్లే ఉన్నది.

అని ఒక బృహత్కథ చెబుతాడు.

అయితే ఈ కవి కూడా ఇంక విచక్షణకు వీలులేని సీమాంధ్ర వర్సెస్ తెలంగాణ గానే దోపిడీని చూడడం నాకభ్యంతరం. కృష్ణా గోదావరులపై ప్రాజెక్టులు వచ్చిన తరువాత ఆ డెల్టాలో వచ్చిన సామాజిక వర్గం మిగులు వల్ల సామ్రాజ్యవాదానికి ఒక దళారీ దోపిడీ వర్గంగా మారింది. రాజకీయ, ఆర్థిక రంగంలో అట్లా ఆరంభమైన దోపిడీ ఆంధ్రప్రదేశ్ ఏర్పడినాక భాషా సంస్కృతులకు కూడా విస్తరించి ఎన్.టి.ఆర్. తో రాజకీయ అధికారంగా స్థిరపడింది. ఈ దళారీ పాత్రకు నిర్వచనంగా దాని సకల దుర్మార్గ దుర్గుణాలతో చంద్రబాబు పాలన. అది కడప రాయలసీమ మరొక సామాజిక వర్గానికి విస్తరించిన వైఎస్ఆర్ నుంచి కిరణ్ పాలన దాక కొనసాగుతుంది. ఈ పిడికెడు మంది దోపిడీదారుల ముందు తెలంగాణ మాత్రమే కాదు పలనాడు రాయలసీమ, తెలంగాణ కన్న ఎక్కువగా ఉత్తరాంధ్ర నలిగిపోతున్నాయి. ఈ సీమాంధ్ర జిల్లాల్లోనే బడుగు దళిత వర్గాలకు సంబంధించి కారంచేడు, నీరుకొండ, చుండూరులు ఒకవైపు పదిరికుప్పం నుంచి వేంపేట వరకు మరొకవైపు ఈ దళారుల దాడులు హత్యా కాండలు జరిగినవి. అటు ఆంధ్ర ప్రాంతంలోను, ఇటు రాయలసీమలోనూ దళిత బడుగు వర్గాలు ఈ దళారీ పాలన అంతమై విడిపోయి కావడి కుండల్లా కలిసుందామని కోరుతున్నారు. తెలుగు జాతీయ కవి వేమన కూడ కడప జిల్లా వాడే. వైఎస్ఆర్ ఒక్కనిదే కాదు కడప. ఆధునిక భావానికి ఆద్యుడు గురజాడ ఉత్తరాంధ్ర వాడు. దేశమంటే మట్టికాదు, మనుషులని చెప్పినవాడు. మనం రావిశాస్త్రి మాండలికాన్నే కాదు వంగపండు మాండలికాన్నీ ఇష్టపడ్డాం.(ఇవాళ వంగపండు ఏమైతేనేం) కనుక నెల్లూరు పొట్టి శ్రీరాములు విశాఖ రావిశాస్త్రిలను ఒకే రకంగా చూడడం కవి సమయం కాదు.

కవి సమయమంటే కవుల విగ్రహాలు కూల్చిన లేదా ఆ ప్రయత్నం చేసిన మిలియన్ మార్చ్ మీద ఈ కవి మార్చింగ్ సాంగ్ ఉన్నది. అయితే ఇటీవల సంగిశెట్టి లాంటి వాళ్ళు కూడ మేం జాషువా, గురజాడ, శ్రీశ్రీ ల విషయంలో వివేచనతో గౌరవంగానే ఆ విగ్రహాలను ముట్టుకోలేదని చెబుతుండగా ఈ కవి మాత్రం జాషువా, శ్రీశ్రీలను కూడా మినహాయించలేదు. జాషువా విషయంలోనేమో

గబ్బిలం సాక్షిగా
ఎగబడ్డ ముప్పయిమూడు కోట్ల దేవతల్లో
ఈ జగడం గాండ్లను కూడ కలిపితే
అచ్చు అంటరాని వాళ్ళ తీర్గనే

తెలంగాణను పీక్కుతిన్న సందేశం
లోకానికింకా బలంగా అంది ఉండేది.

అని కొంచెం సున్నితంగా వెలితేమిటో చెప్పాడు గానీ శ్రీశ్రీ విషయంలో మాత్రం

మహాకవీ!
నువ్వైనా నేనైనా
నేలవిడిచి రాసిన అక్షరం
జన సమ్మతం కాదని
రుజువైంది కదా ఈ క్షణాన అని

జగన్నాథ రథ చక్రాలను భూమార్గం పట్టించిన కవిని తప్పుపడుతున్నాడు. అట్లని ఈ కవికి శ్రీశ్రీ పట్ల ప్రేమ లేదని కాదు. ఎంతో భావశబలత గల నెమలీకల పద్యంలో తనకేమేమి కావాలో చెబుతూ రాశాడు. నెమిలీకలు కావాలనీ, నెలవంకలోంచి వెన్నెల గంధాన్ని తోడ్కోవాలనీ, ఆర్ద్ర క్షణాల మధ్య ఆకాంక్షల గొబ్బెమ్మలను పుష్పించుకోవాలనీ నదీహంస గాయపడకుండా చూడాలనీ ముద్దెడు మట్టిని తీసుకొని దాచుకోవాలనీ ఆది పచ్చి మొగలిపూల జ్ఞాపకాలుగా పండాలనీ, వాలుకు వాలిపోతున్న గాలి దుమారానికి రెక్కలు తొడగాలనీ ఆ పని చేయగల శ్రీశ్రీ పద్యం నుంచి ఆవిట్ని దొంగిలించుకోవాలనీ చిలిపిగా భావించిన వాడే.

అయితే ఏ మాటకామాటే చెప్పుకోవాలి. కర్నూలు తుఫాను భీభత్సం టీ.వీ.లో చూసి ఈ కవియే 'నీటి బొట్టు' అనే పేరుతో ఎంతో సహానుభూతితో కూడిన మంచి కవిత రాశాడు.

పరాయీకరణను బలంగా వ్యక్తీకరణ చేసిన కవిత 'మనిషి కళ తప్పిందు'

మాగాణి పొలాన్ని
రింగురోడ్డు పూలదండగా మార్చి
రైతు మెడలో వేసి
శ్రద్ధగా ఒక కన్నీటి చుక్కను సమర్పిస్తడు

ఈ వ్యవస్థలోని ప్రపంచీకరణ మొదట సృష్టికర్తకు ఉరితాడవుతున్నది. ఎన్నికల ప్రయోజనం కోసం మరణానంతర పూలదండ అవుతున్నది. తెలంగాణలో ఆత్మహత్యల విషయంలో కూడా రాజకీయ నాయకుల నాటకమిదే. ఈ కవి 'నాటకేషు' అనే కవితలో ఈ నాటకం గురించి చెప్పాడు. 'ఉద్యమార్పణం' కవితలో ఆత్మహత్యలు వద్దని చెబుతూ –

నీ కన్న వాళ్ళకు
నీ తెలంగాణకు
నిర్జీవపు స్థూపంగా మిగలటం
ఎవలు కోరుకున్నరు తమ్మీ! అనే ఆత్మ స్థైర్యాన్నిచ్చే కవిత రాశాడు.

హైదరాబాదు కళా సంస్కృతులకు ప్రకృతి సౌందర్యానికి నెలవైన తోటలను బాగే ఆమ్‌లను ప్రజలందరికీ చెందిన ఉద్యానవనాలను, నగరంలోని అరణ్యాలను బ్రహ్మానందరెడ్డి, వెంగళరావు పార్కులుగా మార్చడానికి మనం అభ్యంతర పెట్టాలి గాని ఆ పేర్ల తోటే అవి వాళ్ళవైపోయినవని కుంగిపోకూడదు. మార్కు చెప్పినట్లు మళ్ళీ మన మనభూములను, మన వనరులను, మన భాషను, మన సంస్కృతిని, మన న్యాయాన్ని ఇవన్నీ హామీపడగల పరిపాలనను స్వాధీనం చేసుకుంటాం.

దూదిపీరి ఇంటి ముందు ప్రత్యక్షమైతే
చుట్టూ తిరిగి
ఊదుపొగలను శ్వాసలో కలుపుకున్నోళ్ళం
ఫాతియాలను నమ్మకంగా
గుండెలో నిలుపుకున్నోళ్ళం

మరేమయింది? ఈ లౌకిక ప్రజాస్వామిక భావన. ఈ కవియే ముస్లింలంటే ఉగ్రవాదులనుకునే భావజాలానికి ఎట్లా లోబడినాడు. భారత స్వాతంత్ర్య ప్రధమ సంగ్రామ సందర్భంగా ఇంగ్లీషువాడు ప్రారంభించడానికి ప్రయత్నించి భారత గణతంత్ర ఎన్నికలతో ఈ చీలిక పూర్తయిందా? 1991లో సామ్రాజ్యవాద ప్రపంచీకరణతో పాటే 1992 బాబ్రీమసీదు విధ్వంసం ప్రారంభమై 2002లో గుజరాత్ మారణకాండతో హిందూత్వ విశ్వరూపం చూపిందా? మక్కామసీదు బాంబు పేలుళ్ళకు అమాయకులైన పాతబస్తీ ముస్లిం యువకులు కారు, మిలిటెంట్ హిందూత్వ శక్తులే కారణమని రుజువైనా నమ్మలేని హిందూవాదుల మెట్లా అయ్యాం మనం? తెలంగాణ సంస్కృతి పేరుతో మనం తలకెత్తుకుంటున్నవన్నీ తెలంగాణలో గణనీయ సంఖ్యలో ఉన్న ముస్లింలకు ఆమోదయోగ్యమైనవేనా? ముస్లింలలో ముఖ్యంగా పేద ముస్లింలలో యం.ఐ.యం. వెనుకలేని యువతరంలో బలమైన తెలంగాణ ఆకాంక్ష వ్యక్తమవుతున్నది. మహబూబ్‌నగర్ ఎన్నికల ఫలితాల వంటివి వాళ్ళను అభద్రతా భావానికి గురిచేస్తాయని ఈ ఊదుపొగలను శ్వాసలో నిలుపుకుని గుండెలో నిలుపుకున్న కవియైనా ఒకసారి పునరాలోచన చేస్తాడా?

ఈ నిర్దిష్ట తెలంగాణ పరాయీకరణ కవితల తరువాత మిగతా అన్నింటినీ సార్వజనీనమైన పరాయీకరణ కవితలుగా పేర్కొనవచ్చును. వాటిలో ఎంతో మృదువైన

హార్దికమైన మానవీయమైన కవి భావన ఉంటుంది. ఆ భావనకు తగిన ఊహలు, కవితా శైలి ఉంది. ఈ మొత్తం సంకలనంలో మాట్లాడని మల్లెమొగ్గ వంటి అనుభవం గొప్ప కవిత. 'అతడు మాట్లాడిండు'. ఎంతో ఆర్ద్రమైన మానవీయమైన కవిత. కవితా నిర్మాణం కూడా ఒక నరేషన్ వలె మన కళ్ళ ముందు ఒక ప్రయాణంలో చిత్రాలు రచిస్తూ విచలితుల్ని చేసే కొస మెరుపుతో ముగుస్తుంది. రోజూ బస్సులో చూసే ఒక గొప్ప చిత్రకారుడు, కళాకారుడు, సహజ నటుడు 'మాటకారి' అతడు మూగవాడని తెలిసింది.

నాలో కవిత్వమైన వాడికి
మాటలతో పనేమిటి అని ముగుస్తుంది ఈ కవిత.

ఈ కవిత అంతా మళ్ళీ ఎత్తి రాయాలన్న నా చాపల్యాన్ని అణచుకొని ఆయన ఒక పరిశీలన గురించి చెబుతాను.

ఒక రోజు ఎవరో అన్నరు నాతో
వాడికి మాటలు రావని
కొండలు పగిలినా వినిపించనంతటి
మహామౌనానికి లోనైనా

ఇక్కడ ప్రకృతిలోని ఒక శాస్త్రీయత కవితావ్యక్తీకరణలోనూ ఇమిడింది. పద్యంలో ఇమడవలసిన అందమిది. మహామౌనం ప్రాకృతికంగా బధిరత్వంతో సంబంధం ఉండేదే. 'దుఃఖానుభవం' కూడా మరో మంచి కవిత.

ఏడుపు
జీవన ప్రయాణంలో గొప్ప మలుపు

దుఃఖం ఇవ్వగలిగినంత లోతైన, బరువైన అర్థాన్ని ఏడుపు అనే మాట ఇవ్వలేదేమో. అట్లే ఒక మృదుల, శీతల అశ్రువనడం కన్న ఒక నులివెచ్చని అశ్రువంటే ఇంకా నిండుగా ఉండేది.

ఈ కవి 'కరవాలంపై పద్యాన్ని ఆరబెట్ట' గలవాడు. తన 'ముందరి దారిని ఒక మహా వాక్యంగా' రచించగలవాడు. 'సుదీర్ఘ చరణ ప్రవాహ చేతనోహల సమ్మేళనోత్సవ సందర్భాన్ని' మన కళ్ళ ముందు దృశ్యమానంగా చేయగలవాడు.

వరివెన్ను మీద కూర్చుని
ముక్కుతో గెలను కొడుతున్న
ఊరపిచ్చుక నోట్లోంచి జారిపడ్డ
రెండు బియ్యపు గింజలను

తన కవితా బీజాక్షరాలుగా మలచుకోగలవాడు.

పల్లవిస్తున్న కోకిలరాగాన్ని
నేలపై రాలిపడకుండా పట్టుకోగలవాడు
రోడ్డెంబట కాలాన్ని
వాహనమై తరుముతూ వెళ్ళుతున్న వాళ్ళ నుంచి
పాదచారుల పదధ్వనుల బతుకుల...
పట్టు తప్పుకోకుండా పట్టుకోగలవాడు

ఈ కవిలో బలహీనమైన, పల్చనైన వ్యక్తీకరణలు ఈ సంకలనంలో అటువంటి కవితలు లేవని కాదు. కాని కవుల అనుభవం ఒకటయ్యే సందర్భం కవుల్నీ పాఠకుల్ని ఆత్మీయుల్ని చేస్తుంది.

నేను, సహచరులు, జైలు లేఖల్లో పక్షుల గురించి రాసినపుడు నాసెల్లో వెంటిలేటర్లో పావురాల జంట ఏకాంత శృంగారం గూర్చి రాస్తూ లాకప్ అయినాక రాత్రి నా పాదధ్వనులతో వాటి ఏకాంతం చెదిరి పోకూడదని, ధ్వనిలేని మృదువైన నడక నడిచే జాగ్రత్త తీసుకుంటానని రాసిన దాని ఆధారంగా (ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో చదివి) బొంబాయి నుంచి ఒక చార్టెడ్ ఎకౌంటెంట్ రాష్ట్రపతికి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఒక విజ్ఞప్తి చేశాడు. తన పాద ధ్వనితో పావురాల జంట ఏకాంతం కూడా భంగం కాకూడదని భావించే కవి టెర్రరిస్టు ఎట్లా అవుతాడు అని ? ఈ కవి కింది కవితా చరణాలు చదివినపుడు నాకట్లాగే అనిపించింది. రాజ్యాన్ని దప్ప మనుషులను, మనుషుల సమూహాలనూ మనం ఉగ్రవాదులని ఎట్లా అనగలం?

ఎండిన పండుటాకుల మధ్య
అరికాలు పడిన చప్పుడుకు
జీవన మహావృక్షం
వేళ్ళతో సహా కూలినంత
విలవిల్లాడే -

మనం కవులం, మనుషులం ఈ సున్నితత్వాన్ని కవిత్వంలోనూ, జీవితంలోనూ కాపాడుకుందాం. అది ద్వేషించి ప్రతిఘటించవలసిన రాజ్యాన్ని మనం ప్రేమించే మనుషుల కోసం రద్దు చేసినప్పుడే నిజమయ్యే కల.

వరవరరావు

5 ఏప్రిల్ 2012

ఔ



తెల్లారేదెట్ల

ప్రకటనల సారాంశం
తలలో చిక్కువడ్డ ఆలోచనల గమ్యాలు
రాయి విసిరి
ఉప్పెన భావాల యాతనల్ని లెక్కగట్టడం

కాల సంస్కారం లోంచి
అర్థరాత్రిని వెలివేసింద్రా
పురిటి నొప్పుల్లోంచి పొలికేక పెట్టే ఉషస్తారకు
పురుడు పోసేది అర్థరాత్రి ఆరాటమే

నడిమి చీకట్ల 'సై' యని
పొడుచుకొచ్చిన వెలుగు రేఖకు
అమంగళం అంటగట్టినప్పుడు
ఖద్దరు తొడుగు అరచేయి చాపి
ఒత్తుగా పలికిన సత్తెపమాణాలకు

రాజ్యాంగం
మంటల్లో తగలబడి పోలేదేం
అందరి ఊహల్లో జపమాలై
తిరిగిన తెలంగాణ
కాళ్ళకున్న సిద్ధాంతాలు దులుపుకొని,
బలపాలు కట్టుకొని
తిరిగిన జాగలల్లా రాయబడిన తెలంగాణ
బెడ్ కాఫీ నురగ లరగక ముందే వద్దనడం
ఎందుకు ముద్దయిందో
వంచుకున్న అభిప్రాయపు వెన్నెముకల్తో
చెదరని జనాస్థిత్వపు ముఖ శిఖర దర్శనం ఎట్ల చేస్తరు

పడీ, గాయపడీ, వడిగా లేచి నిలబడీ...
తెలంగాణ ఆటుపోట్ల వినోదం

ఉద్యమం మంత్రాలకు
శాంతి చింతకాయలే రాలినై
మంకుపట్టిన ఉపోషపు దినాలు
కుత్కెల కుక్కిన గర్జనల ధూం ధాం లు
బిర్ర బిగిసిన పిడికిళ్ళ ఎక్కిళ్ళలోనే
బతుకు సంసారాన్ని, బజార్ల
తాయిమాయిల ఆటపాటల కొట్లాటల పొద్దు గడ్పుడు
వాంఛ ఎంతటి గట్టి బొడ్రాయో
బండి గీర తిరిగి సూపింది
పౌరుషాల పాణా లెగజల్లి నిరూపించుడు

కలిసి, కుట్టేసుకుని ఉంటిమా
విడిచి, బ్రహ్మజెముడు తీరాలకు
విసిరేయబడి పోతమా
కవి సమయం లాంటిదే
మీ ప్రేమ సమయం

దూరం మునివేళ్ళకందుతదా...
చూపు కందకుండా పోతదా...
ఎంతెంత దూరమో,
అంతంత దగ్గరా !

కీచురాళ్ళ బుర్రలు నమిలే కిర్రుకిర్రుల
నక్కల నయాటెక్ ఊళల మధ్య
వొడవని రాత్రి

తాత సైర....
తెల్లారే దెట్ల అని
ఔను
'తెలంగాణ ఎట్ల'...

16 ఫిబ్రవరి 2010



ఆకలి రాగం

బాబూ ధర్మం చెయ్యండయ్యా
అమ్మా మాదాకోళం తల్లీ

✤ ✤ ✤

ఆత్మాభిమానం
సత్తుగిన్నె అవతారమెత్తినంక,
నోట్లో నాలుక తెడ్డులా
నిరంతరం ఈదడం మొదలవ్వాల్సిందే

వ్యవస్థ నిఘంటువులోంచి
దురవస్థల బిచ్చపు వ్యాకరణ భాషని బట్టీ పట్టాల్సిందే

గుడిమెట్లో, బస్టాపో
నలుగురు మూగిన సందడి వేళో
ఆశాకేంద్రాలై
ఖాళీ పొట్టలో నిండు చందమామ దూరినట్లు,

ఉవ్విళ్ళూరిస్తయి
ఒక్క కాసుకు
ఎన్నిసార్లు గుండెలు చీల్చుకుని దండాలు పెట్టాలో

నగర మేమైనా
'దయా' గరా జలపాతమా
కన్నీటి బిందు సమూహ హిమ ప్రేమ శిఖరమా

చిల్లర రాల్చని
స్టేటస్ జీవుల నల్లజీరల చూపులు
పాండిత్య ప్రతిభా పాటవాల ఉచిత బతుకోపదేశాలు
కలిసి,
సత్తు గిన్నెను బరువెక్కిస్తయి
"ఎక్కడైతే అడుక్కునే వాళ్ళు వుండరో
అక్కడ దేవతలు ఆనందంతో నాట్యం చేస్తారట!"

"అడుక్కోవడం
హత్య చేసినంత పాపం
నేరం కూడా
దయా, జాలి, సానుభూతి పవనాలను
ఎంకరేజ్ చేయొద్దు"

అందుకేగా
విదేశీ సామ్రాజ్యాధిపతులు
మెహర్బానీలై
మహానగరంలో పాదపద్మాలూనినప్పుడల్లా
కుక్కల్ని తరిమినట్లు
బిచ్చగాళ్ళని ఆకలి, ఆర్తనాదాల్నుంచి
పొలిమేరలు దాటించే
ఘన ధన సంస్కృతిని మొదలు పెట్టినం

కారణాలేం జేసుకోను
మూలకుదురుల్లోకి వెళ్ళి స్పర్శించేందుకు
ఏ ప్రభుతకు
సంపూర్ణ పరిపాలన సరిపోవడం లేదు

రోగిని రోగిగా గుర్తించలేం
రోగాన్ని రోగంగా గుర్తించలేం
అసలు మనిషి నమోనాని గుర్తుపట్టలేం
అతని జీవన గమనాల గమకాలను
గుర్తించే పని చేయలేం

ఆకుపచ్చ సంతకం గిలకటానికి
అధికారి ఆమ్యామ్యా అడుక్కోవచ్చు
మనస్తత్వ వికారాలను
మార్చుడానికన్నా,
మతం మారడం అడుక్కోవచ్చు
పూజా కైంకర్యాలు, నిత్య నైవేద్యాలు
గుళ్ళూ, శఠగోపాలు
రౌరవాది నరకాలను గుర్తు చేసి, మరీ
భక్తుల నుండి దేవుండ్లు అడుక్కోవచ్చు
ఓటు, రాజ్యాధికారం
జనం కడుపుల తలవెట్టి
నేతలు అడుక్కోవచ్చు

ఇవాళ వీళ్ళంతా
గుడ్ గవర్నెన్‌లు
స్వస్థత, శాంతి నొసగే పరిశుద్ధాత్మక ఫాదర్లు

మోక్షఫలం ప్రసాదించే
అఖిలాండకోటి బ్రహ్మాండ పరమాత్మలు
ప్రజాసేవ ఆక్సిజన్ కోసమే
బతుకుతున్న ధర్మప్రభువులు

మూడు బెత్తెల పొట్టకోసం
రెండు ముద్దలు బిచ్చమెత్తుకుంటున్న
బిచ్చగాడున్న చోట్నుంచి
పొలిమేరలే కాదు
ప్రపంచ సరిహద్దుల దాకా
ఎవర్ని తరమాలో
ఊరకుక్కలు పసిగట్టే వుంటయి

నా దేశంల
బిచ్చగాని చేతిలో సత్తుగిన్నె గాక
ఏ జెండా రెపరెప ఎగుర్తుందో
ఆ జెండా మీద
నా బతుకు సంతకం లిఖిస్తా !

27 మే 2008



ఎన్నికల కళ

ఇప్పుడు ఆకాశం బిజీ
మబ్బుల కటౌట్లతో
హామీల తారా తోరణాలతో
ఉరుములు మెరుపుల వాగాడంభరాలతో
ఎన్నికల పదారు కళలను ఆరబోస్తున్నది

దసరా, దీపావళి
రంజాన్, క్రిస్మస్ లాగే
ఎన్నికలను కూడా పండుగ జాబితాలో
నమోదు చేయవచ్చు
మాయామేయ రాజకీయ పండుగగా
ఆరేళ్ళపాటు పబ్బం గడుపుకోటానికి
అంది వచ్చిన కామధేనువు

ఒక్క సూర్యుడు, ఒక్క చంద్రుడు
అనే ఇరుకు కాలం కాదిది

జనాభా పంటి కిందికి
పచ్చడి మెతుకుల సంగతెలా వున్న
తలకొక్క నాయకుడు బయల్దేరినా
గుడ్లు మిటకరించకుండా
గొడుగైతదేమోననీ
జనం, ఎగిరే జండాలతో పరుగులు పెడ్తరు
మేఘ పింజాలు ముసిముసిగా మూగి
ముచ్చట్లలో పడితే
వర్షం గంతులేస్తదని,
నక్షత్రాల కళ్ళలో
మిణుగురులు దాగి
మిణుకు మిణుకు మంటయని
నమ్మినోల్లు ప్రజలు
నాయకమ్మన్యులు విసిరే గాలానికి
ఓటర్లై చిక్కుకుంటరు

ఎన్ని మూరల చెయ్యెత్తి పిలిచినా
ఆకాశం జలదరించి
ముంగిట వాలనట్టే
హామీ
బతుక్కొంగు కొసన
'బ్యాడ'ను ముడేసిన ముడైనా కాదు

ప్రజాస్వామ్యం అనుట
ఒక వింత నవ్వులాట
హక్కుల విలువ, మాడ్పు ముఖపు
రూపాయి మారకం చెబుతుంది

నువ్వు
నీ ఓటు లెక్క పెట్టేంతవరకే
ఆ తర్వాత స్టోర్ రూంలో
ముక్కుతూ మూలిగే బ్యాలెట్ బాక్సువే
మళ్ళా నోటిఫికేషన్ దాకా
వో పనిముట్టువి కావు
ఓటరువి కావు
మనిషివీ కావు

రాజ్యాంగం
రాజకీయానికి సోపతైనప్పుడు
వాళ్ళకి కిక్కు
మనకి చిక్కు

న్యాయస్థానాలు, జైళ్ళ స్థానాలు
అలనాటి మర్యాద రామన్నలేనా
తీర్పులు ఏకపక్షం, స్వపక్షం

అతిపెద్ద వినోదం
జెండాలు నీ చుట్టే
ఏజెండాలు నీ చుట్టే

అత్యంత పెద్ద విషాదం
ఎన్నికల పచ్చుటి కాలం
వాళ్లదే,
వాళ్ళకే

8 ఆగస్టు 2008



పాలితనం

వచ్చిందన్నా, వచ్చాడన్నా
వరాల తెలుగు ఒకటేనని
మన తెలుగు తల్లికి మల్లెపూదండై
వుండమన్నరు మన పెద్దలు
'సొమ్ములు పోనాయండీ' బాబూ
అంటూ మీ రావిశాస్త్రి కలవరించితే
మనసుకు పట్టిచ్చుకుని పలవరించినం
మీ పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ పాఠం
లాగు లేసుకుంటున్నప్పటి నుంచీ
చదువుకుంటూనే వున్నం
యాష్టేపడలేదు
నన్నయ, తిక్కన, ఎర్రనలను
సాహిత్య సామ్రాజ్యాన్ని
ఇంకా ఏలిపిస్తున్నా
నోరెళ్ళబెట్టి చూస్తున్నం

ఆంధ్ర వాఙ్మయాన్ని ‘వేయిపడగలు’గా
విస్తరింపజేసిందని
మీ విశ్వనాథని కీర్తిస్తున్నప్పుడు
అబ్బురపడుతూనే వున్నం
మీ నండూరి వారి ఎంకి సరసాలు
మమ్మల్ని గిలిగింతలు పెడుతూనే వుంటయి.

చిరునవ్వులో సిరులు
దొరలించు తల్లికి
కలిసే మంగళారతులు పట్టమన్నరు
బంగారు పంటలుగా
మురిపాల ముత్యాలుగా
అమరావతి నగరి
అపురూప శిల్పాలుగా
ఆంధ్రమాత నీడలో
తరించమన్నరు మనల్ని

ఇచ్చిత్రం కావచ్చు గని
సాలంతటి సుదీర్ఘ జీవితం
గడపాల్సి వుండంగ
ఒక్క మునుం బతుక్కే
పాడె నెక్కిన మా కాపు
తుఫానులో ఒరిగిన మీ కోస్తా కొబ్బరి చెట్టంత
పాటి చేసిందా
మా మామిడి కాయల్ని
పచ్చళ్ళుగా మార్చి
సొమ్ము చేసుకునే మీ తెలివితేటల కింద
మా దానగుణం
ఎన్నడన్న వెండిపైస లెక్కన కన్పడిందా

మా కొండాపురం మ్యూజియంల బూజైన దులపరు
మీ కాసు బ్రహ్మానందరెడ్డి పార్కుల
లాన్‌పై బడ్డ అడుగుల మరకల్ని
ఫౌంటెన్ నీళ్ళతో చిమ్మేస్తరు
లష్కర్ బోనాల పండుగొస్తే
బోనం వండేది లేదు
బోనం ఎత్తేది లేదు
నోరెత్తితే హైద్రాబాద్
నోట్లోంచి ఊడిపడ్డట్టే
కష్టాల కూడలిలో నిలవడ్డ
మా కవుల బతుకుల పొక్కిలిని
మా కవుల కలాల మత్తడిని
మీ జలతారు పరికిణీల చుట్టి
దాచుకో గలిగారా ?
మమ్ముల నాదుకోడానికి
పుట్టిన కొలువులతో
మీరు ఉద్ధరింపబడుతున్నా,
610 జి.ఓ.
1220 రుగ్మతల వంకర్లు పోతున్నా,
సాక్షాత్తూ బుద్ధుని కరుణూరిన కళ్ళముందే
హుస్సేన్ సాగర్
మా నిరుద్యోగ తమ్ముళ్ళ శవాలకు వేదికౌతున్నా
మీ తిమ్మరుసు ధీయుక్తి
కృష్ణరాయల కీర్తి
ఇంకా మా చెవులల్ల మారుమ్రోగాల్నా
జల (పోల) వరాలు, రింగురోడ్లూ, తెలుగు
భాషా ప్రాచీనోత్సవాలూ

మీ గంపలు నింపేవే
మా కొంపలు ముంచేవే !

ఒప్పందాలకు కాలదోషం పట్టిచ్చిండ్రు
మనసులకు గుణదోషం తగిలిచ్చుకున్నరు
ఇగ
తెలంగాణ ఏషం
మీ వెంటపడి తరుముతుంటది
చిల్లర పలుకులు
సమైక్య నొక్కులు
సింగినాదం జీలకర్రలు అన్నీ
సదురుకొండ్రి, సదురుకొండ్రి
ఫ్లై ఓవర్లని చంకనేసుకుని
నడుములూపే డాన్సుల సినిమా డబ్బాలను
నెత్తిమీద పెట్టుకొని
మీ కోస్తా చెరువుల్లో
రొయ్యలై దూకిపొండ్రి

ఆకాశంల
గోరుకొయ్యల పొద్దు కాడ
చుక్కలు మబ్బులు కలగలసి
తెలంగాణ రాష్ట్రాన్ని
బొమ్మ కట్టిస్తయి
చెట్ల మీది పిట్టలు
రాష్ట్ర గీతాన్ని ఆలపిస్తయి

02 మార్చి 2007



అతడు మాట్లాడిండు

పువ్వు నుంచి పుప్పొడి రాలినట్లు
అస్పృశ్యత సోకని మేఘాలు
గగనంలో కలబోసుకుంటున్నట్లు
అతడు మాట్లాడుతడు
ఒక గుండ్రటి అక్షరంలా
దొర్లుకుంటూ వచ్చి,
బస్సు ఎక్కుతడు
అంతే!
అదిక పుష్పక విమానమై తేలిపోతూ వుంటది
చూస్తూ వుండగనే
అందరి ముఖాలపై
నవ్వుల రంగులు చల్లుతడు
చేతులల్ల చేతులు కలుపుతూ

మనసులను మంచుపుష్పాలుగ మలుస్తడు
చూపుల్తో ఆటబొమ్మల్ని విసిరి
ప్రయాణీకుల్ని పసిపిల్లల్ని చేసి ఆడిస్తడు
మూస్తూ, తెరుస్తూ
తన పెదవుల రంగస్థలం మీద
సకల కళాసామ్రాజ్యం విస్తరింపజేస్తడు

గర్వంలా పాతుకుపోయిన
మైలురాళ్ళ లాంటి సమస్త దాష్టీకాలన్ని
అతని నీడలో ఇమడలేక
పక్కల నుంచే తప్పుకుంటయి

ఎవరై వుంటాడో అతడు!
ఒక తల్లికి ఆత్మ గల్ల, ఒడి మరువని
కొడుకే కావచ్చు
లేదూ
కొడుకును కడుపుల పెట్టుకునే
'తల్లిపేగుల సుట్ట'లాంటి వాడేనేమో!

అతని రోజటి దినచర్య
అదే తీరు
స్టేజీ రాగానే దిగిపోతూ
ఒక అనుభవానికి
ఇంకా చెప్పాలంటే
చినుకుల ఒడిలోకి నెట్టిపోవడం

ఒకరోజు ఎవరో అన్నరు నాతో,
వాడికి మాటలు రావని
కొండలు పగిలినా వినిపించనంతటి
మహామౌనానికి లోనైన!

నిశ్శబ్దపు అపురూపంగా
గుండెకి పాకుతూ,
జీవన, సమ్మోహన, పరిమళభరిత
అనంత సైగల సంపదగా మొలకలేస్తూ,
నాలో
కవిత్వమైన వాడికి
మాటలతో పనేమిటి

(తోటి ప్రయాణికుడు 'మూగ' అని తెలిసి-)

15 ఏప్రిల్ 2005



తెలంగాణ బడిగావాలె

బడిల పిల్లకాయలకు
సదువు జెప్పే సారును గద
గీ నౌకరి గుఱ్ఱ మెక్కినాక
అదెటు వురికితే అటు పోవుడే

చెంగున గెంతిందో ఎల్లెల్కల పడ్డట్టే
అరక, ఇల్లు, ఐరావతం
అంటూ చక్కటి బొమ్మలతో
బోధ చేస్తున్నప్పుడు,
అవ్వ, గుడిసె, ఎద్దు
తడి వూరిన పిల్లల కళ్ళల్లో కన్పిస్తయి
మూగగా ప్రశ్నిస్తయి
ఆంధ్రప్రదేశ్ పట నైపుణ్యాన్ని కల్గించడానికి
నా చేతులే అలసిపోయినై
ఐదు నిమిషాల్లో
వాళ్ళ వూరి నక్షా గీసి నా ముందుంచుతరు
ఆంధ్రరాష్ట్రం అన్నపూర్ణ, రత్నగర్భ అని,
భావోద్వేగంతో పాఠం చెపుతున్నప్పుడు

బీరిపోయిన వాళ్ళ చీకటి ముఖాలలోకి
చూడటానికి భయపడత !
మధ్యాహ్న భోజనం చాల్లేదన్న ఫిర్యాదు గుర్తుకొస్తది

అపెప్, డిపెప్, క్లిప్, క్లాప్, లెప్పూ
ఏడాదికో ఏషంతో
నాకు నేనే వింత రోగిగా కన్పిస్తున్న
ఉపాధ్యాయుడిగా కనుమరుగవుతున్న
బొక్కసాలు మెక్కిన అధికారుల హూంకరింపులల్ల
డ్యూటీ డ్యూటీకి నడుమ
బీపి, షుగర్, హార్ట్‌లను ఒరుసుకుంటూ పరుగులు తీయడమే
డి.ఏ. ను కల గనడానికి సైతం టైం లేదు
పంతుళ్ళ సాలె
ప్రయోగశాలే అయ్యింది
పంతుళ్ళకు పిల్లలకు మధ్యల
అక్షరాలా లక్షల అక్షర దూరం పెరిగింది
గురు శిష్యుల వాత్సల్య బంధం తెగింది

పిల్లలు ఎన్నడో
తమ మనసుల ముద్రించుకున్నరు
"సారు – మనసారు కాదు
పుస్తకాలు – ఇసప్పురుగులే
ఈ బడి – మా కొద్దు" – అని
వాళ్ళు ఇప్పుడు
అడుగుతున్నరు
స్కూల్ పోస్ట్‌బాక్స్‌ల్లోని
వుత్తరాల్లో,
గోడ పత్రికల్లో,
డైరీల్లో

'తెలంగాణ బడి కావాలె' అంటూ

24 ఆగస్టు 2007



దుఃఖానుభవం

పత్రాల్లో
హరిత కలల్ని దాచుకున్న చెట్టుకు
ఆకులు రాలడం విషాదమే
చెలియలి కట్ట
ముత్యపు హారాల కెరటాల్ని కొల్లగొడుతున్నా,
నోరు తెరువని సముద్రానిది విషాదమే
చినుకుల నవ్వుల్ని కురిసే మబ్బుల కోసం
వెదికి, వెదికి వేసారైన
ఆకాశానిదీ విషాదమే
'మానిషాద' శ్లోకావిర్భావానికి
ముందు
క్రౌంచపక్షి బలిదానం విషాదమే

విషాదం... విషాదం...
విషాదం గురించి

ఎప్పుడూ, ఎంత మాట్లాడినా
అది జీవితంలోకి దూసుకొచ్చినప్పుడల్లా
ఒక కొత్త రంపపుకోత అనుభవమే

కన్నీట తడిసిన సనసన్నని
దుఃఖపు తెరలో
బంధీ కావడం ఎవరిష్టపడతరు

ఏడుపు
జీవన ప్రయాణంల గొప్ప మలుపు
కరకర పొడిచే స్వచ్ఛమైన
తూరుపు బంగారు వన్నె పొద్దును దర్శింపజేస్తుంది

ప్రియ వచనాలు
సంప్రీతి కార్యాలు
అట్లుండనీ

ఒక మృదుల, శీతల అశ్రవుని విత్తు
నీలో
మనిషిలో
ఎకాయెకి అంతరాంతరాల్లోకి
పాకుతూ పోయే స్వేచ్ఛ
యిక నీపరం
అప్పుడు, హృదయ హిమాలయాన్ని
సునాయాసంగా ఎత్తగలవ్

మాయల నీడలు
విభజన గోడలు

కల్మషాల రంగులు
అంతస్తుల రుచులు
అన్నీ మాయం

❖ ❖ ❖

ఒలికిన భాష్పానికి
పట్టిన దోసిలి
ఆత్మేదో, బతుకేదో
గుర్తించలేనంతటి
మానవ హార కౌగిలి !!

12 అక్టోబర్ 2007



నిర్ణయం చెయ్

ఏమీ అర్థం కాదు
మరేదీ బోధపడదు
గుడ్డు ప్రపంచం పగిలినంత స్పష్టంగా
మబ్బు పొద్దు చీలి,
గగనం విచ్చుకున్నంత స్పష్టాతిస్పష్టంగా

మూసిన గుప్పిటి ఇసుకల
నక్షత్రాల విలవిలలు
ముడేసిన భ్రుకుటి వెనుక
నావలు మునిగిన నదీ శోకాలు
విప్పారిన అరచేతిల
అల్లుకున్న అరణ్యాలు
పక్షిపాటకై వేటగాడు
గీతల్లో ఎక్కడో

ఆరుబయటి పవన వీచికల్లో తేలియాడవు
పాళీ ఝళిపించి, కాగితాల కట్టల మీద
విసవిసా నడిచిపోవు

ఒంటి స్తంభం మేడలో
నీ బంగారు వన్నెల ఉచ్ఛ్వాస,
నిశ్వాసనల భరిణ,
భద్రంగానే
ఏ గాలిపటాల చాటున
తుఫాను రెక్కలాంటి హృదయాన్ని నక్కిపెడ్తవో
పంచరంగుల్లో నీ అంతరంగం రంగు ఏదో

ప్యాపాలోనే గిర్రోం గిరగిర

కంచె దూకటమో
రైలు డబ్బాల్లాంటి కఠిన నిర్ణయాల్ని
బాసింగాల్లా తలకు చుట్టుకోవటమో
సముద్రం మీద
ధనుష్టంకారం ప్రకటించటమో
కరవాలం పైన పద్యాన్ని ఆరబెట్టటమో

భజంత్రీల వికటాట్టహాసం విన్పిస్తున్నది
కౌరవ రౌరవ సభలో
ద్రౌపది వస్త్రాపహరణం తెరపై కొచ్చింది
'దుశ్శాసనం' ఙంకె వేస్తున్నది

మనిషీ...
సరిగ్గా నువ్వు బైటపడే సమయమిదే!

కూడలిలో నిల్చుని
సున్నితపు త్రాసులో ఊగిసలాట

విల్లంబులందుకుంటవో,
అంపశయ్య భీష్మునిలా
ప్రశ్నించని నేరస్థునివై మిగులుతవో

కాయిన్ చిత్తుబొమ్మ
న్యాయం వైపే వుండాలి మరి

01 జనవరి 2009



గిదిగిట్ల

చిత్ర నాదే
గోనె నాదే
కొలిచిన మూరలన్నీ, పొలిమేరలన్నీ మీయే
గెలిచిన వికటాట్టహాసం ఎనుక
అమ్మ బొమ్మ వికృతంగనే

కత్ర సావదు
పాము ఇరుగదు
విశాలత కుత్తెమై
బాల్ ఏ గోల్ చేయకుండనే
ఆట లక్షణాలన్నీ అవలక్షణాలే

మాటల తూటాలు మునగవు
చర్చల రచ్చలు తేలవు
తొండిల పర్వంలో తోడొక మాయలోడు
వెన్నకుండ మింగి, ఆరు వేళ్ళ ఉత్త చెయ్యి జూపిందు

కోడిగుడ్లొక ఆమ్లెటే
రాళ్ళొక పూలమాలే
దిగదుడుపుల బరిబాతల మనసులకు
కుర్చొక సమ్మోహనాయస్కాంతమే

గుడుగుడు గుంచం
మొయ్యరా కంచం మంచం

గుండెలో ఇంకా శృతి చేయని త్యాగాల రాగానికి
మళ్ళా బలిదానాల మేల్కొలుపు సవాళ్ళు
ముసురుకొస్తున్నయి

ఆకాశం దిగిరాదు
నేల ఎగబాకదు
పంటి కింద పల్లిగింజ
నయాకృష్ణ గీత
నాన్చుడు, త్రేన్చుడు

❖ ❖ ❖

ఇప్పుడు కూడా
తెలంగాణ చందమామ
దోబూచులాడుతూ
అందీ అందక
ఊరిస్తున్నది
మరింత
ప్రియమై,
ప్రాణమై,
అపురూపమై

28 జనవరి 2011



సున్నితంగా

చిటారు కొమ్మను చిటికెన వేలుతోనైనా వంచకు
పల్లవిస్తున్న కోకిలరాగం నేలకు రాలిపడ్తది
అలా ఠపీమని రెప్పల కవచం మూయకు
కంటి చంటిపాప బంగారు కల
సగంలోనే ఆరిపోతది
రోడ్డెమ్మట కాలాన్ని వాహనమై
తరుముతూ వెళ్ళకు
పాదచారుల పదధ్వనుల బతుకు లయ
పట్టు తప్పిపోతది
కాగితం మీద పాళీ ములికితో
సంతకమై పొడవకు
కవి అక్షరంలో రక్తం చుక్క ఉబుకుతది
కిటికీలను సొగసుగా
గ్లాసు కర్టెన్లతో బంధించకు
పైకి కిందికి ఎగుర్తున్న పిచ్చుక
విన్యాసాల విలాసాలు,

గుబురు మామిడి చిగురు పూతల గుబాళింపులు
ఇంట్లోకి చొరబడవు

సన్నటి కన్నీటి జల పుట్టని,
మబ్బురెక్క సొంటి నునులేత స్పర్శ అందించని
గండశిలా సదృశమైన ఊహలకు చేతనలకు
నేను అల్లాడిపోతాను
సంభ్రమాశ్చర్యాల్ని నింపుకున్న గాలిబుగ్గ
టప్‌మని పగిలినా
నాలో ప్రోది చేసుకున్న
పిచ్చుకల గూడు చెల్లా చెదరౌతది
ఎండిన పండుటాకుల మీద
అరికాలు పడిన చప్పుడుకు
జీవన మహావృక్షం
వేళ్ళతో సహా కూలినంత
విలవిల్లాడిపోతాను

ఎదురు వెళ్ళలేని
ప్రచండ గాడ్పులు వీచ నక్కరలేదు
ముందుగనే, అడవి గర్భంలోకి తోసెయ్
ఘనభోంతర దుస్వప్న విస్ఫోటనాలు రానక్కర్లేదు
సప్త సముద్రాల కావల పాతెయ్

మరేమీ వద్దు
అదృష్టహీనుడా
ఆప్తసఖుడా

పెదిమలు విడదీయక
సుతారంగా ఒక చిర్నవ్వు బిందువుని
పుష్పింప చెయ్యగలవా

తలమీద ధరించి
జీవితం పొదుగూతా నడిచెళ్ళుతా
చాలా ... చాలా ... చాలా...
సు...న్ని...తం...గా...!

11 అక్టోబర్ 2008



చెర్వొక కల

అల లెగిరిపోయిన జాడల కోసం
కలల కలవరపాటు
మెడకు తాడేసి, బల్మీటికి
గుంజుక పోయినట్టు
పల్లె కడుపు
పట్టన పగిలిన గోలెమే

కాళ్ళకు నీటిగజ్జెలు కట్టుకుని గంతులేసినం
వాగు సుగంధాన్ని పెయ్యంతా
పూసుకుంటూ ఈత కొట్టినం
బుడుబుంగల పరాచికాల ఆటలకు నవ్వుకున్నం
ముట్టుకుంటే అంటుకునే
చెర్వు పరువాల మీద పద్యాలు రాసుకున్నం
ఇంట్ల మాట్లాడితే

చెరువు మనసులో ప్రతిధ్వనులు విన్నం
దాంట్ల ప్రతిబింబాలు చూసుకుంటూ
రూపురేఖలు సవరించుకున్నం
కాళ్ళ సందుల అల్లిబిల్లిగా కదిలె
కుక్కపిల్ల గీతంలాగ,
వూరికి పెద్దమ్మోరి దిక్కులాగ
చెరువుండె....

సద్దుల బతుకమ్మను
పెద్ద ముత్తయిదువ
చెర్లోకి వొంపే దృశ్యాన్ని
కల కనగలమా ఈ దినాన
ఎత్తైన పరుపు బండల మీంచి
చెరువలుగై దుంకుతున్న చిత్రాన్ని
కలలో ఎక్కడైన కలుసుకోగలమా!

కట్టకు చెరువుకు
నీటికి మనిషికి
నీటి ఋణానుబంధం మాయం
అలలు లేని చెరువు
చెరువు లేని అలలు
ఊహించుకుంటున్న కాలం మౌస్ చేతిల మనం వున్నం

బుడగలు బుడగలుగా విడిపోయిన
చెరువు పదనంటిన స్మృతి ముద్రలను
ఎందాకా మొద్దాం పల్లెవాసుడా

‘కిన్లే’ వాటర్ బాటిల్‌ను చూస్తున్నవా
నా కేమనిపిస్తుందో చెప్పనా
బంగారు పంజరంల
బంధీ అయిన మన ఊరి చెరువులా లేదూ

ఇయ్యాళ్ళ దుకాణంల
నీళ్ళపాకెట్ ముందు
పల్లె బతుకొక బోడి రూపాయే

13. ఫిబ్రవరి 2008



ఎ రిపోర్ట్

రెండు పాదాల పరుగుల సంరంభంలో
నుదుటి మీదూరిన చెమట బొట్లలా
అక్షర లక్ష్యం జారిపోయింది

చేతలు మరచిన హస్తలాఘవ నైపుణ్యాలలో
ఎత్తిన పిడికిట్ల నినాద రవ్వలు నలిగిపోయినై
అగ్గిని ముద్దాడిన శరీరాల వీరోచిత
విస్ఫోటనాలకు,
విషాద ప్రకంపనలకు
ఆన్సర్ చేయని రెటీనా
పరీక్షకు నిలబడలేక
పదవీ సౌందర్యపు మడతల్లో
బరిబాతల బల్లిలా
సుఖాల పురుగుల్ని కరుచుకు తింటున్నది
ముక్కోటి గొంతుకలు
గల్లీల మైకుల నిండా ప్రతిధ్వనిస్తుంటే

కర్ణభేరి
డప్పు దరువెయ్యక
హీరోచిత పాటల బీట్‌లో చిత్తడై పోయింది
ఏ.సి. గాలిని పీల్చి, వేడి గాలిని వదిలే
సాధారణ స్వార్థ శ్వాసక్రియలోనే
ముక్కుపుటాలు మునిగిపోయినై
ఎగిరిపడే భావాల
అనువాదపు మాటల్ని కుప్పవోసి, అంటువెట్టి,
నాలికమీద 'నో కామెంట్' చెక్కుకుని
సంశయాత్మక పిచ్చిగా నోరూరేగుతున్నది
ధమనుల్లో
సానుభూతి రసాలూరకుండ,
బుల్లెట్ దెబ్బలకు చిక్కకుండ
ఇనుప ఆంక్షల భద్రతా మత్తులో
రక్తమండలం భద్రంగా ముడుచుకున్నది
ఆకాంక్షల ఉడుకు తగులనీయక
స్వేద రంధ్రాల్ని మూసుకున్నది స్పర్శేంద్రియం
నైసర్గికంతో పాటు
అస్తిత్వాన్ని కూడా అమాంతం బుక్కవెట్టి
భుక్తాయాస ఉబ్బరపు వేయింపులో జఠర కుటీరం
మస్తిష్కాన్ని కోల్పోయింది

అవయవాలు సరిగా పనిచేయడం లేదు
అసహ్యపు వాసన వేస్తున్నది
సారీ –
ఈ శరీరం
ఉద్యమం చేయలేదు
తెలంగాణకు అస్సలే పనికిరాదు

13 ఏప్రిల్ 2011



F.M. తంత్రుల మీద

నాలుగు వుంగరాలున్న
నాజూకు వేళ్ళతో
అందంగా ట్యూన్ చెయ్యి
బతుకు పుటల 'రెయిన్‌బో' రంగుల మయమే !

కలర్‌ఫుల్ కల్చర్‌ల సరికొత్త బాణీలను
నాన్‌స్టాఫ్ యాంకరింగ్‌లో
బిట్లు బిట్లుగా దొర్లిస్తుంటే
చెవులకు మెదడు నప్పజెప్పి
విందాం విందాం
ఉల్లాసంగా ఉత్సాహంగా...

ట్రాఫిక్ కోరల్లో
రహదారులు బక్కచిక్కినా
ఫైళ్ళకు ప్రాణం పోయాల్సిన పని గంటలు
రెడ్ సిగ్నల్స్ గద్దింపులతో

పనికిరాని గంటలై
నలుపుకుంటున్న ఖాళీ చేతుల్లోంచి
అభివృద్ధి ఓ మెట్టు కిందికి జారిపోతుంటే,
బైకు వెనకాల పాప
నిదుర అంచుకి ఒరిగిపోతున్నా
గాబరాపడకు
F.M. వుందిగా
'వాట్ ఎ ఫన్' అనుకుంటూ
మిస్ అయిన లైఫ్‌కి
కావలసినంత స్పేస్ ఇచ్చి
ట్రాఫిక్ వింతల్ని SMS చేద్దాం

చరిత్రలో
ముఖ్య ఘట్టాలిప్పుడవే!

కోడికి ఈకలున్నట్టుగనే
గుడ్డు కెందుకుండయి
రెండు కళ్ళు రెండు చెవుల్లాగే
మనకు రెండు తలకాయలెందుకుండయి
తెల్లావు తెల్లపాలిస్తే
కర్రావు కర్రెపాలెందుకు కియ్యది
డౌట్ల దావూద్ పుట్ల డౌట్లకు
సెల్లులో సిల్లీ ఆన్సరింగ్ చేసుకుంటూ నవ్వుకుందాం
కాలం విలువనా ?
దానికి 'ఆఫర్' ప్రకటించినప్పుడు చూద్దాంలే
జనానికి సేవ చేసుకోవడం కోసం
పార్టీలెన్ని పోటీపడుతున్నా

దరిద్రరేఖ
భౌగోళం పొట్ట మీంచే ఎందుకు పోతున్నదని,
మనిషిని టచ్ చేస్తే
ఎదో ఒక పార్టీ మానిఫెస్టో ముఖకవళికలతో అరవడమెందుకని
దావూద్‌కి అస్సలే డౌట్ రాదు,
ఫన్నీ ప్రోగ్రామింగ్ బిజీలో

మరి గడుసుపిల్ల గౌతమి సంగతో...
మాటలు షురూ చేసిందో
నాలుక మీది నాలుగు మాటలు ఊడ్చుక పోతయి
ఇష్టపడిన సాంగ్‌ని
సచిన్ బర్త్‌డే కి డెడికేట్ చేసి, వదులుకొమ్మని
డాడీతో కొట్లాడిన క్షణాన్ని గుర్తుకు తెచ్చుకుని,
'సారీ' తో ఫాదర్‌డేని సెలబ్రేట్ చేయమని
అమ్మపాలు తాగకున్నా
తాగిన అనుభూతిని అంగుళం 'కాప్షన్'లో
బంధించమని
ప్రేమ పక్షులు వాలడానికి
చెట్లే కరువయ్యాయని
ఆ నేరం సమాజానిదా,
తల్లిదండ్రులదా – అని,
వాలెంటైన్ డే నాడు
'లవ్' పిచ్‌లో శ్రోతల్ని చక్కర్లు కొట్టిస్తది
యువ మేధో శాలలు
యాసిడ్ ల్యాబ్ లై
ప్రేమ కసితో బుసబుసా పొంగుతుంటే,

తన జవాబును మాత్రం
పాట పాటకు ముందుకే వాయిదా వేస్తది,
గడుసుగా గౌతమిపిల్ల

ప్రశ్నల దారి వెంట నడవాల్సిన అవసరం లేదు.
సుదూరం నుంచి పాతమిత్రుని
పురాతన పిలుపు వీనుల కెక్కించుకునే ఎమర్జెన్సీ వుండదు
తోవలో ఎదురైన దృశ్య పరంపరలన్నీ
మనసు జారుడు బండమీంచి
కాగితపుండల్లా జారిపోతాయలా
బస్సు సీట్లో దిగబడ్డాక
రెప్పలు వాల్చేసి,
ఇంకేమి అక్కర్లా
రెండు మెత్తని స్పీకర్ బిళ్ళలు
చెవుల నిండారా
జీవన వైశాల్యం అంతటా కమ్ముకుంటూ !

స్టాప్‌లో ఎక్కిన
హాండిక్యాప్ అంధుడు
చేతులతో పాకులాడుతూ
వెతుక్కుంటున్న తన సీట్లోంచి,
'ఇది చాలా హాట్ గురూ' అంటూ
మిర్చీ సంగీతం దండెత్తుతున్నది

24 మార్చి 2009



మనిషి కళ తప్పిండు

రెండాకుల మధ్య చల్లగా దూరిన సూర్యతేజం
ఉండుండి, పొడిపొడిగా రాలుతూ
ఎండబొొబ్బలు పెడుతుంటది
పానాది పొంటి నడుస్తుంటే
అడుగులు పదమవ్వకుండా
పానాది పాము ఊహల మెడకు చుట్టుకుంటది
ముద్దుగా... ముద్దగా
నేర్చి, వొల్లిస్తున్న చిలుక పలుకులకు
చిలుకే నొచ్చుకుంటది
శాంతిని రెక్కలకింద ముడుచుకున్న
పావురాలను ఎగరేసినప్పుడు,
పావురాలే సిగ్గుపడతయి

మనిషి పల్లె నొదిలిండు
నమ్మి నానబోసిన అపురూపమైన ఆశలు
పుచ్చిబుర్రలైనయి

తను దేనిమీదా
విగ్రహ వాక్యంలా నిలబడడు
అరికాలి వేళ్ళమీదా
మడమల మీదా
చురుక్కుమనే సంతకం మీదా
యుద్ధభేరి మాటమీదా

దిక్కులు భుజాల మీద
అతని పేరునే మోయాలని చట్టం చెబుతది
విరోధ భావనాబలం విస్తరిస్తదేమోనని
రెండు కనుబొమ్మల మధ్య
పచ్చివార్తల్ని కుప్పవోసి, భగ్గున మండిస్తడు
పాముల పుట్టలో చేరి
మాయల కోరల నతికించుకుంటడు
మల్లెపువ్వు
దిగజారుతున్న సెన్సెక్స్ కన్న
ఈ మనిషిని చూసి,
ముఖాన్ని మసిబొగ్గు చేసుకుంటది
ఎవ్వరినైనా చిత్తు కాగితంతో పోల్చి
తిరుగుటపాలో పంపేస్తడు

అల్లావుద్దీన్ అద్భుత దీపాన్ని
చెవికి తగిలించుకుని,
వలల్ని, పాశాల్ని విసురుతుంటడు
మాగాణి పొలాన్ని
రింగురోడ్డు పూలదండగా మార్చి
రైతు మెడలో వేసి,
శ్రద్ధగా వో కన్నీటి చుక్క సమర్పిస్తడు

చందమామ
వెన్నెల పత్రాలను పంచటానికి జీవో ఉండది
ఆకసం తలెత్తుకుని
మబ్బుల మిత్రులతో విహరించే సందర్భం
యిక రాబోదని
కవి హెచ్చరిక రాసి పెట్తడు

భూమండలమంత నోరు,
గగన మండలమంత పొట్ట,
రాత్రనకా, పగలనకా
అధికారం యాత్రలో, యావలో
మనిషి కళ తప్పిండు !

29 జనవరి 2009



పని ధ్యానం

కత్తంచు గోడమీద నిల్చుని
నున్నని అడుగుల ముద్రల్ని పేర్చుతూ
నాట్యావతారం ఎత్తరా !

విరిగిపడే అలపై
ఎల్లకిలా పడుకొని
విచ్చిన సూర్య పుష్పాన్ని ఆఘ్రాణించు
చంద్రవంకకి
నీ చేయిని దానం చెయ్యి
'పిడి'గా అమర్చుకొని
కొడవలి ఆయుధంగా మారనీ
ప్రభాతం కనిపించని చీకటి మూలలల్ల
చుక్కలతో నినాదాల్ని పేర్చు

ఎగుర్తున్న వయ్యారాల గాలిపటాల చాటున వున్న
మబ్బేసిన ఆకాశాన్ని ఆవిష్కరించు
అక్వేరియంలో దిగులు దిగులుగా కదుల్తున్న
చేప పాపకి
కొంచెం కొంచెం పద్యమదిరపాత్ర నందించు

జల్లులో తడిసి
బురద బురద అయిన నేల
ఒక మట్టి పలక
కళ్ళకద్దుకో
వరపుత్రుడి వౌతవ్
రాలిన ఆకులన్నీ
మధుర భావనలేనన్న సంగతి,
మరచిపోనివ్వ వృక్షాన్ని
ఇగురు పూతల కాలపు కోయిల కూతల్ని
బహుకరిస్తానని హామీపత్రం రాసియ్యి

పొడుగాటి కాడల
గునుగుపూల గుర్తులు వెతుకు
తంగెడుపూల బంగారు కళతో
ఇంటిని తాపడం చెయ్యి

అనుకోని ప్రతిసారీ,
సీదా రస్తా

అడ్డంగా, అడ్డుపడినప్పుడు
పొద్దు పొడుపులో
మిన్నాగు బుసలు వ్యాపించినప్పుడు,
ఎవరూ నడవటానికి రాని పలుగురాళ్ళ బాట
ఎవరి కోసమో ఎదురు చూస్తున్నప్పుడు

సమస్త ప్రపంచాన్ని నిలవెట్టి
మాట్లాడు లేదా కొట్లాడు
సర్వశక్తుల్నీ ఒడ్డి

15 ఏప్రిల్ 2010



ఇరుగుడు

వలస కులాసా
పరాయోల్ల నదీ పడవలో హైలెస్సా

మాట పొత్తు కలిపి
చెట్లకాయలు గుంజుకొనుడు
దోపిడీ చెడుగుడు
దొరల్లా గదుముడు
పెద్దోల్ల సుద్దులు బుద్దిల కెక్కలే
ముల్కి సూత్రాలు
అయ్యవార్ల సగోత్రాలు
ఉద్యోగాలు ప్రమోషన్లు
నిత్య పెళ్ళి కొడుకుల తంతు
జగమెరిగిన ఆరొందల పది
రాజకీయ మదిలో ఖైదీ

యవ్వారం యాపారం
కువార్కం కుతర్కం

చరిత్ర ఎత్తుపల్లాలు
ఎత్తు పుటలన్నీ కబ్జా
తెలివంటే జిత్తులే
పాయిదార్ల జిగురు పూసిన కత్తులే
సోకులు జూపి సొమ్ములు చేసుకొనుడే
కళల మీద కాలు రువ్వుడే

❖❖❖

కుమ్మరి సారె తిప్పుండ్రి
కమ్మరి కొలిం ఊదుర్రండి
దొడ్డి కొమురయ్య జాగ పూదియ్యండ్రి

❖❖❖

పండుగలు పబ్బాలు
ఈసడింపుల పాలు
సినిమోల్ల సరదాకు
దేవుడి పేరు బలి
ఆంధ్రా టిఫిను
ఆంధ్రా భోజనం
గల్లీలన్నీ సాంబారు వాసనే

గాలి నీళ్ళు అడ్డా
ఎవలది బిడ్డా
శాని భాష
శాని ఏషం

శాని జీవితం

శానా 'శాని' అని గొప్పలు

అర్థాలు తోడడానికి కూచుంటే

అంతా నాదానే

✤ ✤ ✤

బాగోతం గద్దె కట్టుండ్రి

నెత్తికి రుమాలు చుట్టుండ్రి

నాగలి నెత్తుకుని శిగ మూగుండ్రి

జొన్న కర్రల జులూస్

జోరు జూపిస్తదిగ ....!

19 నవంబర్ 2007



అవిశ్రాంత హక్కు

బాలుడా
గోపాలుడా కాదు
ఆబాల గోపాలుడు
హక్కు ప్రసవించిన ఉద్యమ సాహసి

తల మాసినా
ఆలోచనల ఊట పవిత్రమే – పరిమళమే
బనీను లేని ముతక అంగి
మనో సంకల్పానికి వజ్ర కవచమే
నాలుగు మూలల దొడ్డు కళ్ళద్దాలు
నీతిమాలిన ప్రపంచ పోకడలను వడకట్టడమే
చలువ పందిరి ఉద్యోగం
ఎడమ చేత్తో విసిరి
నలుపు చట్టాలపైన ఫోకస్ చెక్ కై
ముళ్ళకోటు సహవాసం

సూర్యుడికి అలసిన క్షణం ఉంటదేమో
గాలికి చేరని చోటు ఉంటదేమో
మిమ్ముల పోల్చడానికి వస్తువేది సార్ !

కవి తడబడుతున్నడు
గద్గద పడుతున్నడు
మనిషి ఎలా తయారైతడు
రక్త మాంసాలతోనా!
జనం కన్నీళ్ళతో
హక్కుల భంగపాటు లోంచి
ఎగజిమ్మిన అనర్గళ వాక్ జలపాతమై మీలా

మానవ జాతి ఎక్కడ
అని పరిశోధన చేస్తే
మీ చిరునామాలో మీరుండరుగా
జేబులోంచి మీ ఫోటో తీసి చూపడమే
మాకు దక్కింది
వాకపల్లి సిగ్గులను వెలివాడగా దోచినా,
గుడిసె బతుకులను
తాటాకుల్లా విసిరేసినా,
చేతుల్లోని పని బువ్వను గుంజేసినా,
భయకంపిత ఎన్‌కౌంటర్ ఘటన సృష్టించినా
'అన్యాయమో బాలగోపాలా' అని మొరబెడితే
నిద్ర దుప్పటి దులిపేసి
మబ్బులనే రోడ్డుమీద ప్రత్యక్షం

సార్ !
ఖాళీలను పూరించాలన్నరు
హక్కులకు విస్తృత అర్థాలు కలిపి
పొలిమేరలు చెరిపినరు
ప్రతి హక్కు చుట్టూ
గౌరవప్రదమైన కంచె నాటినరు
మీరు చెప్పిన హక్కుల చట్రంలో
ప్రాణికి జీవించే హక్కు ఉన్నది కద
అర్థాంతరంగా దాన్ని కొట్టివేసే
హక్కు ఎవ్వరికీ ఉండకూడదు కద

మామూలు ఎక్కిళ్ళతో మొదలైతే
మరణం తుది అంచుదాకా
మిమ్మల్ని లాక్కెళ్ళిన మృత్యువుపై
కసిదీరా కేసు పెడ్తం
మీరు వాదించాలె

వింటున్నారా సార్ !

18 అక్టోబర్ 2009



సై సై నాయకా

బరిలో
బావిలో
మనసులో
దిగినాక,
గెలుపు శ్వాసాస్వాదనే ముఖ్యాతి ముఖ్యం

లోతుల భయాల గగుర్పొడులను
సాగర ఘోషలో తడిసి, ముద్దయి
విరిగిపడని అలల్తో విశ్లేషించాలి
ఆత్మబల స్వారీ గమన వేగాన్ని
కంటి కొస చూపుతో కొసరి, కొసరి
వింటినారిని గుంజి, అంచనా కట్టాలి
గాల్లో తలలు వూపే
పరివారమ్ముల భజనాలాపన

కవిత్వం పొదలో
స్వచ్ఛపు వన్నె పోల్చుకోవాలి

ప్రజా నాయకుడిగా ఎదిగినవా
పలు ప్రశ్నల సూదులతో
ఒళ్లంతా గుచ్చుకో
చీము నెత్తురు
మరికొంత ఉప్పొరిన బతుకుల వొత్తిని
వెలిగించే కన్నీటి జలం
చివ్వున ఎగజిమ్మిందా

సంక్లిష్ట సమయాల సంక్షోభాల నాగళ్ళతో
దేహాన్ని దున్నించుకో
సుగంధపు పుప్పొడి రేణువుల్లా రాలుతున్నవా
విత్తనం
పది చేతులుగా విస్తరిల్లి
పంట సౌభాగ్యరాశిని మోస్తున్నవా
ప్రజాకోట వాకిలి ముందు
నేర వర్ణపు సిగ్గుతో, తలవాల్చని జెండాలా
రెపరెపలాడు

పార్టీల గుర్తుల వెనుక
ప్రతిజ్ఞలు మూగవోతయి
సింబల్‌గా మారకు
జన హృదయనాద ముఖ చిత్రంగా ఆవిష్కరించుకో
సబ్బండ దురదృష్టాలకు ఫైసలా చేయని,

కోమటి చిట్టాలాంటి పథకాల బిచ్చాలేసే
వ్యూహాల వేషాల దాసోహాల
ఏకైక లక్ష్యా కక్ష్యలోంచి,
నేతిలేని నీతుల వల్లింపుల,
అడుగు కింది నేల కూడా అమ్మకాల
సొంత చింతనా తరలింపుల లోంచి
విజయ క్షణాల మాధుర్యాన్ని
ఉట్టిలా కొల్లగొడతావ్,

జనం గాద్దుకి 'జై' అను

5 ఏప్రిల్ 2009

ఔ



పవిత్రోద్యమం

సదాశయ సఫలం కోసం
గొంతుల ముడులు బిగగట్టి
పొలికేక పెట్టే ఉద్యమ గర్జనకు
మూలస్తంభాలైన దిక్కులు పిట్టల్లా ఎగిరిపోవలసిందే
నింగి మూలలకు దాక్కున్న
నల్లమబ్బుల కుబేరులు బైటకొచ్చి
ముసురుకొని కురవాల్సిందే

ఉద్యమం ...
నత్తి నోటికి
విచ్చుకత్తుల కుచ్చులతో
ప్రవహిస్తున్న సముద్రంతో
ఓ కత్తి నినాదం దానం చేయిస్తది
ఇరిగిన చూపుని

పాలపిట్ట రెక్కలపై ప్రయాణించి,
సుదూర తీరాల రెపరెపలాడే
ఆశల జెండాని అందుకోనిస్తది
అలుపెరిగిన వేళ
బండెనక బండి కట్టిన
పదారు బండ్లల్ల
గజ్జెల రువ్వడి పాటై గమ్య మెరుక పరుస్తది
ఓటమి వెంటాడిన చోట
మంటల్ల జ్వలించిన
శ్రీకాంత పుష్పంతో
తప్పులను నిప్పులతో కడగాలని యాది చేయిస్తది

✣ ✣ ✣

పుట్ట పగిలిన ఆకాంక్షల దండు
ప్రతి నుదుట మండుతున్న తెలంగాణ గుండం

✣ ✣ ✣

గండాలను
మాసికం పిండాలతో దిష్టి తీపిస్తది
వంట వార్పుల్ల
మాడ్పు పేగుల మంటల నిరసన సెగల్ని ఎగజల్లిస్తది
బువ్వ తినని హఠాలతో
సహనం పరీక్షల కొచ్చెగైన బంగారు కత్తై
'మెడను గురిచూస్తా' ననిపిస్తది
మానుకోట దిమ్మ తిరుగుడుకు
పలుగురాళ్ళ పంట పండిస్తది

తెలుగు తేజాల న్యాల ముచ్చుల బుద్ధులకు
నిమజ్జనం పండుగ నిర్వహింప జేస్తది

తిరుగోలే
తెలంగాణ పేరే
అందిన నేల పైన
అందుకోబోతున్న ఆకాశంపైన
తెలంగాణ ఉరుమే

దాశరధి చూపెట్టిన
'కోటి రతనాల వీణ'ని
అక్కున జేర్చుకుని
మోగిస్తున్న ఉద్యమమా !
నీకు దండం
వర్ధిల్లు !!

22 ఆగస్టు 2011



శీతలోదయ వేళ

కప్పుకోడానికి
ఈ అందమైన చర్మం సరిపోతలేదు
వెచ్చబడడానికి
ఈ రగ్గులూ, పెగ్గులూ, కాంతా
బాహు పరిష్వంగనాలూ సాల్త లేవు

చలి
సల్లటి చలి
హిమగోపురం తలమీద పెట్టుకొని
నాట్యం చేయుమని బెదిరించినంత
జర మండుతున్న ఎండని సైతం చుట్టు ముట్టి,
సాయంత్రం ఐదు గంటలకే
చలిగంటలు కొడుతూ
హెచ్చరికలు జారీ చేస్తది
తలుపులతో పాటు

తలపులు కూడా బిర్ర బిగుసుకుపోతయి
ఏ తలుపూ తెరుచుకునే సాహసం చేయదు
ఏ పిలుపుకైనా
ఎన్ని పిలుపులకైనా

ఎవరూ ఆత్మీయంగా
చేరదీస్తలేరన్న అక్కసుతో
రాత్రంతా చలి కొరడా ఝులిపిస్తూ
మంచు సూదులతో పొడుస్తూ వినోదిస్తూనే వుంది

పాపం
రాత్రి మాత్రం ఏం జేస్తది
తను మౌన సాక్షి మాత్రమే దేనికైనా
దర్వాజ ముంగల
పిల్లి, దాని కూనల
వణుకుల దీనాలాపన
వాడ మలుపుల
ముసలి శునకాల గజగజల కుయ్ కుయ్లు

మనుషులంటే మానే
గీ చిన్న జీవాల పైనా
కొంచెం కనికరం చూపని
చలిదేం పోయే కాలం
కుండీల్లో పూసిన పూల
ఒళ్ళంతా మంచు ముద్దర్లే
ఏ పువ్వో గుర్తు పట్టలేం
చలి ముఖాలేసుకుని
స్థాణువుల్లా నిలిచిపోయినై చెట్లు

చలిని వెళ్ళగొట్టాలి
చలికి సలి పుట్టించి, వణికించాలి
చలినెదుర్కొనే మొనగాడే లేడా
గట్టిగా చప్పట్లు చరువ్
గా ఏడేడు లోకాల ఏడు గుర్రాల
రథ సారథ్యున్ని పిలువ్

చలి మృగాన్ని చీల్చుకుంటూ
పాలలాంటి ఉదయాన్ని
ఇంటింటికీ పంచుకుంటూ
వస్తున్నాడదిగో పాలవాడు

ధైర్యంగా లేవండిక

7 జనవరి 2008

ॐ



కాలే దృశ్యం

తిరోగమన పవన చాపం
అర నోటిలో తొణికి, ఆగిపోయిన మాటల కొండ వాగు
డబ్బాల సుక్షేత్రాల్ని మోయకుండ
పట్టాల మీద గెంతులేస్తున్న రైలింజను
గుడ్డు ప్రిదిలి
బతుకు సొన మట్టిల కలిసినట్టు
పురులు విడివడి
పేనిన సమాలోచనల సారాంశం పుట్టుక్కున తెగడం

అడుగుల ఖాళీ మధ్య
అడుగడుక్కీ పంచాయితీ
ప్రపంచ పరిణామ వేదిక
వేటస్థలమయింది
మృగయా వినోదమయ్యింది
పొడుచుకొచ్చిన ముఖ మూపురం

ముందుకైతేనేం?
దువ్వుతున్న కాలు వెనక్కే
వన్ మౌస్‌తో డ్యూయెల్ గేమ్‌ల పిచ్చి సరదా
అద్దం వెనకాల పచ్చలైన ప్రతిబింబాల
వెక్కిరింతలు
తుమ్మెదల ఝుంకారాల సంకీర్తన లుండయి
ఆశల ముడులు విప్పుకుని, పతాకల ఎగరేతలుండయి
ఆకాశం చెట్టుకి
ఎప్పుడు చూసినా, కచ్చికాయల ఉదయాలే
రాలిపడ్డ ప్రతి పువ్వుల
ప్రేమ వాసనలకై వెదుకులాట
పాలొలక బోసుకున్న తావుల
జీవగంజి నెత్తుకునే తండ్లాట

నువ్వేమన్నా మాయె !
కొస అంటుకున్నది
కొనదాకా మండవలసిందే

తిరోగామి పురోగామి గాక తప్పదు

12.11.2011



ఆత్మవేధ

కిటికీ రెక్కలు విప్పి
పద్యాన్నెగరేద్దామనుకొన్నానో లేదో
బిగ్గరగా పూలగోల

స్వప్న పలకల ఒంటిస్తంభం మేడ
కుప్పకూలింది
అగర్‌బత్తీల మొహబ్బత్ పొగలకు
ఆకాశానికి వూపిరాడ్డం లేదు
కశికెడు కన్నీటి చెలిమల్ని వడకట్టలేదని,
పెరటి కరివేపాకు మొక్క అగ్ని ప్రవేశం చేసింది.

రహదారి బంగరు వడ్డాణాన్ని మడిచి,
జేబు పక్క సొరగులో దాచుకున్న
కొండచిలువై ఝూడించి, తప్పించుకున్నది
నర్మ గర్భాల్లేని రాజస్థానీ మీగడ సోకుల్ని
పగడపు పరిభాషని

అక్కడెక్కడో దాచేసి,
గేటుని విశాలంగా తెరిచిందా పిల్ల
పిలుపుల్ని దులిపిన వొట్టి చేతులతో

నడిజాము రాత్రి అయితే చాలు
మొండి తోక కుక్కకు
సీతమ్మవారి కష్టాల హరికథా గానమే
తెల్లారే దాకా
పురాణ పురుషులెవరూ అటుగా రారు
వరమేదైనా ఈయరు

తొవ్వల రెక్కలు విరిగిన
సీతాకోకచిలుకలు,
గాబరాగా గెంతుతున్న
తెల్ల కుందేళ్ళ పిల్లలు
మెడ కురివడ్డ
బంగారి పురుగులు

మరో ప్రపంచ నిర్మాణానికి
అత్తారెలకై
పరుగుల వేట

అరిగిన బలపంతో
షట్చక్రవర్తుల్ని గీయలేరు
పలిగిన పలకలో
ప్రజాస్వామ్య ఎల్లలు లిఖించలేరు
పసితనం పాపం కూపంలో కొట్టుకుంటున్నది

వేణువుని కత్తిపోట్లకు గురిచేసి
రాగాల్ని దొంగిలించినతను

సత్యాగ్రహ శిబిరంలో దండేసుకున్నదు
తెగిన శిరసొకటి
చెట్టుకు వేలాడుతున్నది గాలిపటమై

కనురెప్పలపై
కందిరీగల కవాతు
నాసికం మీద
గండు చీమల దండయాత్ర
పెదవుల మీద
గున్న ఏనుగుల పరుగు పందెం

చౌరస్తాలోని
ప్రజా నాయకుని విగ్రహం పక్కన నిలబడిన
అయినా,
దాడి ఆగేట్టు లేదు

గాలి కెరటాల మీద బాదుతూ అరుస్తున్నారెవరో
శృతిలయ మేళవింపులో ప్రవహిస్తున్న
సముద్రం మధ్యన
పద్మవ్యూహం జ్వలిస్తున్నదని

రా
నాతో
నాలుగు అడుగులు వెయ్ !

24 ఫిబ్రవరి 2010



సిత్రాలు

తొవ్వ నడువనీ

ఈ తాప
తెలంగాణ బుడ్డగోచి
అందరికీ పట్టువస్త్రమైంది
జెండా కట్టి, ఊరూరా తిప్పుకుంటున్నరు
మూల మూలలో కుంపటి రాజేసుకుంట
తెలంగాణ చిటపటలు విన్పిస్తున్నరు
రాజకీయ ఉద్గ్రంధ పదకోశంలో
తెలంగాణ పేరును
మొదటి పేజీలో చెక్కడానికి
పనిముట్లకు పదును పెట్టుకుంటున్నరు
తెలంగాణ పెద్ద దర్వాజ దాటకుండా
ఎవరూ జనక్షేత్రంలో కాలు మోపడం లేదు

పొద్దు
తలల సుట్టూ తిరుగుతున్నది

రాజకీయ సూర్యులు రంగులు మారుతున్నరు
మొన్నటిదాకా అంటిన మురికి దద్దుల్ని
తెలంగాణ గోదాట్లో మునిగి
కడుక్కుంటున్న మంటున్నరు
సూత్రీకరణల్లో యతిప్రాసల్ని మార్చుకొని,
ప్రత్యేక రాగాన్ని ప్రాక్టీస్ చేస్తూ
తెలంగాణ తల్లి ముందట
చెంపలేసుకుంటున్నరు
ప్రజాభీష్ట మంత్రోచ్చారణలతో
తెలంగాణ జపం చేస్తున్నరు

తొవ్వ కరుగనీ

మీ విజయవాడని
వరద కృష్ణమ్మకు అప్పజెప్పుకోండ్రి
మా లష్కర్ పట్నం
తెలంగాణ తల్లి నుదుట పుట్టిన పచ్చల తిలకం
మార్పు చేయడానికి బొట్టు బిళ్ళ కాదు

లెక్కలు తేలాల్సిందే
పైసా పైసా దోప్కం హెచ్చు వేతల్లో
కళ్ళు బైర్లు కమ్మి
ల్యాంకో హిల్స్‌పై నుండి జారిపడితే
కోస్తా రస్తా కూడా మిగలదు

తెలంగాణ అరుపుకి యాభై ఏళ్ళు
అటూ ఇటూ మీ వయసంత
మీ గొంతు ఎన్ని కొట్లాటలు చేసింది
సీమ గర్జనకి శిత్పలాకే బెదరదు

రాళ్ళ సీమ గురించి కన్నీళ్ళు
రాల్చడం నేర్చుకో

ఉర్దూలో దర్ద్ లేపకు
ఉర్దూ తెలంగాణ మాట
తెలంగాణ ఉర్దూ మాట
దూదిపీరి ఇంటి ముందు ప్రత్యక్షమైతే
సుట్టూ తిరిగి,
ఊదుపొగలను శ్వాసలో కలుపుకున్నోళ్ళం
ఫాతియాలను నమ్మకంగా గుండెలో నిలుపుకున్నోళ్ళం

మైనార్టీ మైనార్టీ
ఏ పార్టీ

తొవ్వ ఒడువనీ

సాగీ సాగీ అలసిన కలలకు, కన్నీళ్ళకు
నో రెండో ఎస్సార్సీ
అడ్డుపడిన వాళ్ళు
అడ్డం పడాల్సిందే
మేఘ రహదారులన్నీ కలసి,
అరచేతి చప్పట్ల
బతుకమ్మ ఆడాల్సిందే
బతుకమ్మ కిరీట ధారియై
తెలంగాణ రాష్ట్రం వాకిట్లో వాలాల్సిందే !

4 నవంబర్ 2008



చలన శీలం

కాలిగోటి కవచపు అంచైనా,
కంటిరెప్పల్లో దోపుకున్న దృక్కోణాల్లోంచి
పిసరు చూపు మొనైనా,
తల్లిపొట్టలోని శిశువు ఆవులిస్తే
చిన్నిపెదాల మీద చిట్లిన మాయిపొరల
చిటికెడు నవ్వులానైన ఆడాలె

వాక్యాడంబరాల చుట్టూ అల్లుకున్న
భావ ప్రవాహ నురగలు,
వెన్నెల ముఖం మీద ముప్పిరిగొన్న
నిశి నిశబ్దపు మబ్బు తొఁణుకులు,
విసనకఱ్ఱ విసురుకు
కొమ్మ చివరాకు చెంప సొట్టలోంచి
జారుతున్న కాంతి బొట్టులానైనా కదలాలె

గుహ ద్వారాన్ని బండరాతితో కప్పెట్టి,
ఊపిరి వూసులతో దాగుడు మూతలాడొద్దు
కనుబొమ్మల రెంటి నడుమ
ఎక్కుపెట్టిన భృకుటి శరాన్ని
నాసికా రంధ్రాలోచనల్ని మూస్తూ, బాధించకు

గుండె బిలం నుండి
బిలబిలమంటూ స్కూల్ పిల్లల
నిష్క్రమణ వరద

దేహం పొట్టి శ్వేతపత్రమే

ఎవరో ఆకాశాన్ని పట్టి వూపినట్టు,
ఆశల ముసురు కింద
తహతహల భూమి కాయంలో
ఒక కదలిక మొదలవ్వనీ
పదను గాయాల
గెంతుల అడుగుల చప్పుళ్ళకు
హరివిల్లు పాట అల్లుకోనీ !

31 ఆగస్టు 2009



జీవ భాష

దేశ భాషలందు లెస్సగా
కీర్తించబడిన తెలుగు కిప్పుడు
జీరో మార్కులే

ఒకనాటి అమృత భాష
నేడు మృతభాషగ రోదిస్తున్నది
యాభైయ్యారక్షరాల తెలుగు దిగ్గజం
ఇరవైయ్యారక్షరాల ఆంగ్ల గిరికి లోకువై పోయింది
జీవగంజికి చెల్లని సంతకమయ్యింది

త్రిమర్కట న్యాయ సూత్రంలాగ
తెలుంగు అనకు
తెలుంగు వినకు
తెలుంగు కనకు

పోతన మందార మకరంద మాధుర్యాలు,
కవిత్రయపు ఆదిభారత మహా విశ్వ విరాట్ స్వరూపాలు,
శ్రీనాథ పద్య సార్వభౌమాలు
మొల్ల మడికట్టిన రామభక్తి భావనా ప్రపుల్లాలు
'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్' స్టార్‌లల్ల
మలిగిన ఆణిముత్యపు చుక్కలే

పాలిష్ భాష
స్టైలిష్ భాష
క్యాష్ భాష
ఆంగ్లమేనంటూ,
తలే కాదు సమస్త దేహమూ
దాంట్లో దూర్చి
శ్వాసించడం, నిద్రించడం
ఆంగ్లంలోనే జీవించడం,
ఆంగ్లీకరణ చెందడం
నేటి నేటివిటి

మాతృదేశానికి మాతృభాషను లేకుండా చేసి,
తల్లిరుణం తీర్చుకుంటున్నాం ఈ తీరున

ప్రేమించడం
భ్రమించడం
రెండూ రెండు భిన్న వర్ణాలు

సృజనకై
ఏ భాషలో ఆలోచిస్తవు ?
ఆకలిగొన్న పులి ఎదురైందనుకో
గుప్పుమన్న భయం

తప్పించుకునే ఉపాయం
ఏ భాషలో రాసుకుంటవు
అనుభవాలు
అనుభూతులు
జీవన్మరణాలు
ఏ భాషకు లొంగవు
ఏ భాషకు ఉప్పొంగవు

నిన్ను నేను చేరుకోడానికి
నన్ను నీవు కోరుకోడానికి
భాష మనిద్దరి మధ్య
ఉక్కిరి బిక్కిరి కాకూడదు
తల మీదనో
కాలి కిందనో
దాని స్థానం నిర్దేశించకు
హృదయంలో పీట వెయ్యి

భాష ప్రాణమైతది
ప్రాణ ప్రదమౌతది

జీవద్భాషా హోదాకి నీది
వారసత్వ మౌతది

13 నవంబర్ 2008



ఆ యిల్లంటే...

కిర్రుమని
వాకిట్ల దర్వాజ తీసిన చప్పుడు లేదు
ఊరికెళ్ళేటప్పుటి
అల్లిబిల్లి తలుపు గొళ్ళాల మేళం వినిపించదు
పెద్దరుగు మీద
ముచ్చట్లల్ల పడిన అన్నయ్యల ప్రక్కన
ఎగిరి కూచునే విజయసంబరం లేదు
ఇంటెనక బావి దగ్గర
పాలదాలిలో
కాగిన పాల అట్టువాసన మధురంగా వ్యాపించదు
చుట్టాలకు గంగాళంల
స్నానానికి తోడిచ్చిన వేడినీళ్ళ పొగలు
శరీరాల్ని చక్కిలిగింతలై చుట్టుకోవు
పొద్దున్నుంచీ పొద్దీకేదాక అడిగినోళ్ళకల్లా దూసిచ్చిన
కల్యామాకు రెమ్మల సౌకుమార్యం కనిపించదు

ఇంటి ముందు దొడ్డిల
పాలపొంగుళ్ళ, పేడతొక్కుళ్ళ ఆబాదికాలపు ద్రుశ్యాల్లేవు
కచ్చరానికి సవారి సన్నద్ధపు అలంకరణ లేదు
ఇరవై సాపలు పరిచే ఇంటిలోగిట్ల
పిల్లా పెద్దల పెళ్ళి ఏర్పాట్ల సందళ్ళు లేవు
చీకటి అర్రల గరిశెల నిండిన ధాన్య సంపద
చీకట్లనే కలిసింది

ఇంటిపక్క దేవుడి గుళ్ళో
మోగిన గంటానాదం
విరిగిపడిన ధ్వజస్థంభం కింద
నలుగుతూ మూలిగింది
దీపావళి నాడు మబ్బుల, సలిల
హారతిచ్చేందుకు ఇల్లిల్లూ తిరిగే
అయ్యవార్ల జాడలు
కరిగిన కర్పూరం పళ్ళెంల మసిగొట్టుక పోయినై
గుది గుచ్చిన ఉభయకుశలోపరుల ఉత్తరాల దండ
కొయ్యకు వేలాడదు
బావి గిరక మీంచి జర్రున జారుతూ
మంచినీళ్ళు తెచ్చే, వంచుకొని తాగే
బొక్కెన కంటి ముందుకు రాదు
వాకిట్ల నులకమంచాలేసిన
పరాచికాల కడుపుబ్బ నవ్వుళ్ళ ఎన్నీల రాత్రులు లేవు
వసారా ముందు కచేరిల
పంచాయితీ తప్పాల
బరువు దించుళ్ళ ఆరాటాలు లేవు

నవాబు టోపి పెట్టుకొని
గుర్రం మీద స్వారి చేస్తున్న
పదూళ్ళపెట్టు పెద్దబాపు
తెలుపు నలుపు రంగుల ఫోటోదర్జా లేదు
పెద్దగంటెతో పెద్దగా వడ్డించే
పెద్దరికపు పాందాన్ పెద్దాయి లేదు

కుక్కి కుక్కి కూచుండ బెట్టే
సర్వీసుల
నేనిప్పుడు ఆ వూరికి పోతలేదు
ఆ వూరికి
ఆ ఇంటికి
ఒక పెద్ద తాళం కప్ప వేలాడుతున్నది

25.12.2011



మా చరిత్ర మాక్కావాలె

కొంచెం తవ్వి, వదిలేసిన కందకాల్లో నిలబడి,
పురాస్మృతుల వికసిత పరిమళాలను పీలుస్తున్న

చరిత్ర
జ్వలిత నేత్ర
పట్టించుకోక శిధిలాల మరపున తోసినా
కంచు గర్జన చరిత్ర
అసెంబ్లీ పోడియపు ప్రజాస్వామిక సింహాసనం కింద
తుపాకితో నిలువునా పాతినా

వసంత కాలాన
పూల రంగులు వెలిసిపోతే వెలిసిపోవచ్చు
అచ్చు వొత్తని గురుతులు మాసిపోవు

మట్టిపెల్ల పెకిలిస్తే
కాగంచుముక్క మహాధాన్యాగారమై ఎదుట నిలుస్తది
కడుపులు నిండిన

కమనీయ రాగాలను ధ్వనిస్తది
బాటో, రాజమార్గమో అయ్యుంటది
ఇరువైపులా సోలుపూతా
రాజ్యం ప్రజలు బారులు తీరిన రాతి కనీల్లా
శాతవాహనుడు అశ్వారూఢుడై
బయలు దేరిండని
చెట్లాకుల జయ జయ ధ్వనాల హోరు
కోటలో
కలిసున్న ఎనిమిది అద్రల అపూర్వ కళా నిర్మితం
భూమిల ఒరిగె

ఎన్ని జ్ఞానాలు
ఎన్ని స్వేదరాశులు
ఎన్ని కళాభోగాలు
ఈ మట్టి చెరల
మౌనంగా ఘూర్ణిల్లుతున్నయో

గాథల బరువుతో
బరువు బరువుగా నడుస్తున్ననా
పాదాలకు బంగారు నాణాలు తగులుతయి
సొక్కం బంగారమై మెరుస్తున్న చరిత్రకు
తవ్వకం మెరుగు పెట్టని
నిర్లక్ష్యపు వంచనని
'తొవ్వల నిలబెట్టు' మని ప్రార్థిస్తయి

చెరువుకట్ట
గోడుగోడుగా వెంట నడుస్తది
రుజువులు

పొలిమేరలు దాటిపోనీకుండా
కోట బురుజు లెక్క కావలి వుంటనన్నది

నాలుగు చలవరాతి గోడల మధ్యన
టంకశాల గోల ఎవలు ఆలకిస్తున్నరు

క్యూలు కట్టడానికి
మ్యూజియం
అమ్యూజ్‌మెంట్ పార్క్ కాదాయె
తిరుపతి ఎంకన్నలా
గుండైనా ప్రసాదించదాయె

వస్తువో, ధనమో దొంగిలించొచ్చు
జ్ఞాపక చిహ్నాలను
చారిత్రక సన్నివేశాల్ని
మాయం చేయడం – చోరకళ
పొసగని తమ మొహాలకు
పులుముకోవడం – నీచ కళ

అవశేషాల వైభవాలను కథలుగా
వర్ణించి, చెప్పని మ్యూజియం గైడ్
వీలైనప్పుడల్లా చరిత్ర గొంతుకి అడ్డం పడుతుంటడు

అద్దాల షెల్ఫుల్లోంచి బేలగా చూస్తున్న
ఆనవాళ్ళ ముందర
కట్టేయబడ్డ అపరాధిలా కదుల్తున్న

పగిలి ముక్కలైన చుక్కల మట్టిపాత్రలో
తళతళలాడుతున్న తక్షశిలా నగరం
చూపులే జారిపోయేంత

నునుపు దేరిన మట్టికూజాలను
మళ్ళా మళ్ళా తాకి చూడాలె
తాజ్‌మహల్ పాలరాయికి
ప్రపంచ సుందరి బుగ్గలకు ఈ లెక్కన గిరాకీ ఎందుకో

దర్వాజంత ఎత్తున్న
దర్వాజల పట్టని
కాగును కావలించుకొని, ఏడ్వాలని
కన్నీళ్ళతో నింపేంత దుఃఖమై పోవాలని
చిన్నవిలో చిన్నవి
పెద్దవిలో పెద్దవి
అనేక రూపాల సహజ సౌందర్యాత్మకం
నన్ను ఆనాటి కాలంలోకి విసిరేస్తూ

కూలిపోయిన ఒక శకపు సాక్ష్యం మదర్ గాడ్డెస్
మనకు దీవెనార్తి పలకడానికి
చెయ్యి ఎత్తిపట్టే వుంచింది
గంటం చేసే శబ్దాలతో
గుణాఢ్యుడు ఆజ్ఞాపిస్తున్నట్టే వుంది

కవీ
సభ పెట్టు
మహత్తర బృహత్కథ
మరోటి వెలుగు జూడాలె

(కొండాపురం మ్యూజియం సందర్శనానుభవం)

13 ఫిబ్రవరి 2009



నీటిబొట్టు

తామరాకు దోసిలిలో
తారంగం ఆడేది

రాళ్ళేసినా
అడుగునుంచి పైకొచ్చి
అమృత గుళికలై
కాకి గొంతులోకి జారేది

వాకిట్లో సానుపై
పరిశుభ్రపు తెమ్మెరలు
ఇంట్లోకి మోసుకొచ్చేది

పూల పరిమళ జగత్తుకు
మరణం వుండకూడదని
మల్లె వేళ్ళ పొదికి ప్రాణభిక్ష పెట్టేది

చిట్టిపాదాల కెరటమై
సముద్రపు యెదమీద గెంతేది

మబ్బు పెదాలపై
తడి తడి పదాలతో నవ్వేది
సొమ్మసిల్లిన పత్రాల ముఖాల జూచి చెమ్మగిల్లేది
ప్రకృతికి మొలకల పులకలు పుట్టించేది

భూదేవి ముక్కెరలో
కురిసే, మెరిసే వర్షపు నీలమా
ఓ నీటి బొట్టా
సమస్త జీవకోటి ప్రాణం గుట్టా

మరచెంబులో ఒదిగిన దానవు
మహాంబుధి వెల్లైతివి
ఉద్ధరిణిలోంచి ఉప్పొంగి
ఊళ్ళనెట్ల ముంచితివి
ఇంటి కెవరైనా వచ్చినపుడు
గ్లాసెడు నీళ్ళిద్దామంటే భయంగా వుందే !

ఎండిన పూచికపుల్ల కూడా
నీతో కయ్యం పెట్టుకోదు గదే
అనబడని
సమస్త మానవ దేహాలు
చాచిన వేల చేతులుగా అల్లాడుతూ

ఆ వాచిన కళ్ళ తొవ్వల్ల
పొంగకే
ఇంకా ఊరకే

(కర్నూలు జిల్లాలో తుఫాను భీభత్సాన్ని టీవీలో చూసి)

21 అక్టోబర్ 2009



నెమిలీకల పద్యం

నాకు దోసెడు నెమిలీకలు కావాలె

పింఛం విప్పిన
నెమలి నాట్యాన్ని
నా పద్య చరణాల్లో కూరుకోవాలె
వరి వెన్ను మీద కూచుని
ముక్కుతో గెలను కొడుతున్న
ఊరపిచ్చుక నోట్లోంచి జారిపడ్డ
రెండు బియ్యపు గింజలు కావాలె
ఇరువాలు దున్నిన ఆకాశంల
ఎఱ్ఱెఱ్ఱని రథాలు తోలే సూర్యుల్ని
మొలిపించడానికి చల్లుకోవాలె
వాలుకు వాలిపోతున్న
గాలి దుమారానికి రెక్కలు తొడగాలె
అవిట్ని
శ్రీశ్రీ పద్యం నుంచి దొంగిలించుకోవాలె

దారులన్నీ
అడుగుల పడగలతో
బుస కొడుతున్నయి

నెలవంకలోంచి
వెన్నెల గంధాన్ని తోడుకొని
దారుల నిండా పూయాలె

నిశీధి నీడల మాటున
కుట్రల తాళ్ళు పేనబడుతున్నయి
మసి బొగ్గుల నడిగి కొన్ని
నిప్పు కణికల్ని రాజెయ్యాలె,
తాళ్ళు మాడిపోవాలె
వివస్త్ర అయిన రామచిలుకల సిగ్గులు
భూమి నెన్నుదుట రాసిపెట్టాలె
కబళించే రాత్రులంతటా
ప్రతి చెయ్యిని ఉరితాడుగా వేలాడగట్టాలె
కాంక్షలు కాలిన చితిలోంచి
బూడిదను గుప్పిళ్ళ కొద్దీ ఎత్తుకొని
దిక్కుల ముఖాలపై ముగ్గులు పెట్టుకోవాలె –
కొన్ని ఆర్ద్ర క్షణాల మధ్య
ఆకాంక్షల గొబ్బిమ్మల్ని పుష్పించుకోవాలె
ఆవగింజంత రాయినైనా సరే విసరకుండాలె
నదీహంస గాయపడుతది
ఒరాన నిల్చుని పిల్లంగోవిని వాయించాలె

నది మొత్తం నీ ఒళ్ళో వాలుతది
పాదం లేపిన పోరాటస్ఫూర్తికి
అలల అందెల్ని అలంకరిస్తది.

నువ్వొకరూ
నేనొకరం
ఎప్పట్లా ఆమె కూడా
మునుపట్లా కాని మరో అతడూ
కలుసుకున్న చోట్లల్ల
గుడ్ల నీళ్ళు గిర్రుమన్న జాగలల్ల
ముద్దెడు మట్టిని తీసుకొని దాచుకోవాలె
అది
పచ్చి మొగలిపూల జ్ఞాపకాలుగా పండాలె

20 జనవరి 2008



పూల లోకం

పువ్వుల నెవ్వలు ఏమంటరు ?

యెడద రెక్కలు విప్పుకొని
పుట్టుక రంగులు పెట్టుకొని
కొమ్మకొసన
వినమ్ర శిరః ప్రకంపనతో
ప్రాకృతిక అందచందాల పారవశ్యమై

తొవ్వల నడిచే
అడుగులు మరచిన కాళ్ళాగీ,
నుడుగులు పెగలక నోళ్ళెళ్ళబెట్టీ,
పుష్ప సన్నిధికి దాసోహమయ్యా

ఒకే ఒక్క రెక్కను మృదువుగా తెంపుకుని
నా కిరీటంలో అలంకరించుకున్న
ఆదాటున వచ్చే సువాసనా భరిత పిలుపుకు

వేయి రేకులుగా బతుకు ఆయుష్షును విప్పార్చుకున్న
స్నిగ్ధ మనోహర సమ్మోహిత సోయగాలకు అచ్చెరువొందీ,
ముకుళిత పద్మ శరీరినై సిగ్గొందీ
ముడుచుకు పోయిన

కాలుష్య కాసారపు గాలి ప్రియుల్ని కౌగిలించుకోవాయె
మేఘుడుగ్రుడై కర్కశ వర్షంతో దండెత్తినా
అస్తిత్వ రంగీన్ చరిష్మాని వొదిలేసుకోవాయె
తిరుగుడు పొద్దు సుట్టూ ప్రదక్షించి
ఏ పొద్దుకూ కాకుండ పోనే పోవాయె

వేల కాలాల నుంచీ
చెట్టుతల్లి ఎత్తిపట్టిన అరచేతులల్ల
అపూర్వ సృష్టిగా,
ఆత్మీయ సుకుమార స్పర్శగా పరివ్యాప్తమౌతూ

దేహమొక్కటే తొడుక్కున్న మానవ సంతతికి
మనస్సు అట్టడుగు పొరల్లోకి
జారిపోయిన లేలేత కువకువల్ని
ఊటలా పొంగిస్తూ
పూల ప్రపంచం

ఇప్పుడెవలేమంటరు
ఆ ఒక్క చిన్ని ముల్లు గురించి

6 ఆగస్టు 2011



ఉద్యమార్పణం

తమ్మీ !

తొవ్వల ఉద్యమ రథం నిలవెట్టి
తొవ్వ తప్పిపోతివా
తిప్పలు పెడ్తున్న 'తిరుగుడు గుమ్మి'ని ఈదకుండనే
ఆశయాల అనుమతి తీసుకోకుండనే
తరాన్ని
నిప్పుల్లోకి నెట్టే నైరాశ్య సందేశపు దుఃఖాన్ని
ఎట్ల ఇవ్వగలిగితివి

చరిత్రలో
చారిత్రక గోతులు తవ్వినందుకు
కన్నెర్ర చేసినవాడివి
పట్టా
చిత్తు కాగితమై, ముల్లై గుచ్చిన వైనాన్ని
ప్రచార భేరై మోగినవాడివి

భాషకు
గోడకుర్చీ వేసి అవమానిస్తే
వేదిక మీద నిప్పులు కక్కిన వాడివి
బతుకు సుట్టూ మూగి
చలి కాచుకుంటున్న బలుపును
ఇనుప కంచెలు తోసి
అటాక్ చేయబోయిన వాడివి

అసెంబ్లీ, బషీర్‌బాగ్, ఉస్మానియాలే కాదు
రహదారులన్నీ నీతోనే పోటెత్తిన నిజం
నీ యాదికి రాలేదా
ప్రకటిత నిర్ణయాన్ని
అప్రకటితంగా, అప్రతిహతంగా, అపహాస్యంగా
వాయిదా వేస్తున్నందుకు
గేటు వూచల మీద అరచేయి గుచ్చి,
నీవు తీసుకున్న కఠిన నిర్ణయం
ఉద్యమం కంట్లో రక్తం నింపి
ఎదురీదే ముందుదారిని మసక బార్చింది

తమ్మీ!
మడతపడ్డ నాలుకల మీద
కత్తులు పదును పెట్టుకోవాల్సి వుండె
రాజీపడిన పదవుల మెడలో
అమరవీరుల త్యాగాల దండ వేయాల్సి వుండె
బహురూపాల పోరాటానికి నీ అధ్యయనం

మెళకువలు రచించాల్సి వుండె
అన్నింటికన్నా ముందు
తలనెగరేసి
పిడికిట్లో జండా బిగించి,
జై తెలంగాణ నినాదమై
ఉద్యమాల గుంపు ముందు
చిందు వేయాల్సి వుండె

అంత అతలకుతలం
చేసిన తమ్మీ!

నీ కన్నవాళ్ళకు
నీ తెలంగాణకు
నిర్జీవపు స్థూపంగా మిగలటం
ఎవలు కోరుకున్నరు తమ్మీ !

9 డిసెంబర్ 2010

ఔ



మహా వాక్యంగా

శరీరాన్ని ముల్లె గట్టుకొని
నిట్టనిలువునా మోస్తూ నడుస్తున్నానా

నా ముందరి దారి ఒక మహావాక్యమై
సుదీర్ఘ చరణ ప్రవాహ చేతనోహల
సమ్మేళనోత్సవ సంరంభం –

ఈ మహావాక్యంలో జ్వాలా ద్వీప రహస్యాలెన్నో

తలకట్టు తళత్తళల పదును విన్యాసాలు
గుడి దీర్ఘాలతో జట్టుగట్టి చెట్టపట్టాలేసుకుంటూ
పులకరించే పలకరింపుల హోరు
సవాలక్ష కాంక్షాంకురాలు
అరువదియారు కళల చలువ కాంతులు నింపుకున్న
నిండు సున్నాల చంద్రబింబాల
ముఖారంవింద విప్పారిత భావనా వీరంగాలు

ఏకలవ్యుని దీక్షా సమరంలోంచి
దూసుకొచ్చిన అమ్ముల అక్షర వరుస
చిదుగులను పోగేసి
అలజడుల మంటగా రాజేసే
పదాల పద ఘట్టనల ఊరేగింపు

(నేల మీద నేమో దారాయె
కాగితం మీద నేమో వాక్యమాయె
ఏకంగా అల్లిక పోలిక విచిత్రం
ఊహ జనిత మాయా సందర్భం మహిమే!)

బరువైన, ఓడిన నైరాశ్యపు మనోవేదనల
మబ్బు పెళ్ళలు కూలిన
లోయలను అలముకొని బావురుమనీ
గుట్టల మొలచుట్టూ పెనవేసుకున్న
పొటమరించే వీరగాథల కచ్చెరువొందీ
నదుల పారకపు ఆరాటపు గీతల నుదురుపై
పచ్చల వరిగింజ పొదిగీ
అల్లకల్లోలపు పిలుపుతో కూడుకున్న
మేఘ గర్జనలో సంలీనమయ్యీ

మహావాక్య మహత్తర మహత్తుల
గమన రీతుల ఆస్వాదిస్తూనే
అబ్బురపడుతూనే

ఒక్కొక్క శబ్దాక్షరాన్ని
పాళీ మునివేళ్ళతో తడుముతూ
నాలుక చివర గూడు కట్టుకున్న

తటపటాల పెదిమలు దాటని పొగడ్తలతో ముచ్చటిస్తూ,
అరలను దాటుకుంటూ
ఉప్పొంగిన లబ్‌డబ్ ఆత్రపు స్పందనల గుండెకి
ప్రపుల్లంగా హత్తుకుంటూ,
తోడిపోస్తున్న పరిపక్వపు అనుభవరాశిని స్వీకరిస్తూ,
సారాంశ స్పర్శ కోసం
ఒడలు విరుచుకున్న కఠిన జీవన దేహంతో
బుడుంగున మునుగుతూ

నడక ఆగాక చూస్తే
మహా వాక్యం చిట్టచివర తేలిన
ఆనందపు క్షణాల బరువుకు
రెప్పలు తెరువలేని పికాసో చిత్తరువునయిన
మహావాక్యానికి
మహా సమస్కారం చేద్దామని వెనక్కి తిరిగితే
శూన్యపు వేదికపై
కుక్కపిల్లలు కువకువలాడుతూ గంతులేస్తున్నాయక్కడ

అడుగుల తడి గాని, పొడి గాని,
ఒత్తులే పడని
యోజనాల తొవ్వల నడుస్తున్న

నేనే మహా వాక్యాన్నయి...!

2 మే 2010

ॐ



నెగెటివ్ గానే

హృదయానికి
నాలుగు వైపులా బార్లా తెరిచిన
తలపుల తలుపులను వెంటనే మూసెయ్యి
గది మూలల్లో
ఏ పులుగూ
పల్చటి, నునుపైన రెక్కలెగరేసుకుంటూ
సరాగాల సవ్వడి చెయ్యనీయొద్దు
సీలింగ్‌కు వేలాడుతున్న ఫ్యాను
గిరగిరా తిరుగుతూ,
దాన్ని చుట్టుకునే సుడిగుండపు
ఆలోచనల దుమారం
అంటిపెట్టుకుని వుంటే
ఠక్కున స్విచ్ నొక్కేయ్
నిలువెత్తు పొగరుతో తల ఎగరేయవద్దని,
దర్జాగా, ఖరీదైన బీరాలు పలకవద్దని

గాడ్రేజ్ బీరువా మూతికి × మార్క్ లేబుల్ అతికించు
సేదదీరే డబుల్ కాట్‌తో పాటు
ఫక్కున నవ్విన పగటి కలల్ని,
చుక్కలు అలిగి, మలిగి,
చంద్రుని జాడ కానరాని,
అంత తొందరగా ఆవిరిగాని
రాత్రి సమయాల్ని కాల్చి పారేసెయ్

గదంతా ఈదుతూ
అణువణువూ గాలించు
చీపురుపుల్ల దొరికినా
గంద్ర గొడ్డలిలా మారుతుందేమో
ధూళికణం కన్పించినా
అగ్గిరవ్వలా రాజుకుంటుందేమో
ఇస్త్రీ చేసి, మడత పెట్టిన పట్టుబట్టల నుంచి
తలంబ్రాల వాసన వీస్తుందేమో
విరిగిన పెన్సిల్ ములుకులు,
అట్టలూడిన ప్రైమరీ వాచకాల పేజీలపై అడ్డదిడ్డపు గీతలు,
నేను నేనంటూ
గుఱ్ఱం బొమ్మ గీయబోయి
గాడిదలా అయినందుకు
మూతి తింపుల్ల వెక్కిరింతలు
తినుబండారాల అభాండాల సిగపట్లు
బుంగమూతి మొహాల, అల్లరి చేష్టల
ఇల్లుపీకి, పందిరేసిన పోలికలు
గదంతా ఆవరించే వుంటయి

నాకు తెలియకుండా
నాకు కనిపించకుండా మేనేజ్ చెయ్యి

అర్థ నేత్రాలు విప్పిన
నల్లతాచు రాత్రి పరదాల కదలికల మాటున
నాకు నేనే
పూర్వపు పరిచయంలా ఎదురుపడతానేమో

చిత్తు కాగితం ముక్క దొరికినా చూడు
అందులో అక్షరం రాసి వుంటదేమో
గాల్లో కలిసి,
మబ్బుల ముషాయిరా తుఫానులు సృష్టించొచ్చు

గదిని,
నిర్మానుష్యం, నిరలంకారం, నిర్వీర్యం
నిర్దాక్షిణ్యంగా చెయ్యి
పాళీ పెట్టిన పుల్‌స్టాఫ్ అంత కూడా
గదిలో ఏమీ కన్పించొద్దు నాకు
అంతా అయ్యాక
వెళ్తూ వెళ్తూ ఒక్కసారి నా ముఖంలోకి
ఒక రెప్పపాటు నీ దయార్ద్ర చూపు
బొట్టుని ఒంపి వెళ్ళు
కత్తిగాట్లు వద్ద నా ముఖం
ఎప్పుడన్నా నీకలలో కొచ్చి, నిన్ను
గుచ్చి గుచ్చి ప్రశ్నలడిగి
సతాయించక పోతుందా

గది బయట
తాళం బాగా వేశావో లేదో

తడిమి, తడిమి చూసుకో
మళ్ళా తాళం తీయడం
పూర్తిగా మరచిపోవాలి సుమా

ఇప్పుడు గదా
గదిలో నాకిష్టమైన
ఏకాంత సామ్రాజ్య వైభవోన్నతం –
నాకు నేనే సర్వం సహా చక్రవర్తిని
నాకు నేనే సర్వం సహా భిక్షవర్తిని

ఇన్ని యోజనాల ప్రయాణంలో
మనిషి తన పాద ముద్రల్లో
ఎన్నడన్నా బంగారు కాసులు ఏరుకున్నడా

ప్రజాస్వామ్యమా అలంకరించుకో
పంచవర్ష ప్రణాళికల ఏడువారాల నగల పెట్టెతో
శరీరం నుంచి, గుండెని తవ్వి,
తీసుకొని
అద్దంలా నాముందు ప్రతిష్టించుకుంటా –
మనసారా
తనువారా
కనులారా
అద్దంలా ఎన్నో ఎన్నో సార్లు
అలలెగిరి పడుతున్న అంతరంగాన్ని
వణుకుతున్న చేతుల్తో పట్టుకుని
లాలించడానికి ప్రయత్నిస్తున్నా

నిజానికి
స్వంత మరణాన్ని ఇట్ల ఎదురుగా

చూసుకొని మురిసిపోవడం
ఏకాలమిచ్చిన జడ్జిమెంట్ ?

ఆకాశం మేల్కొన్న తర్వాత
రేపటి పేపర్లో
నలుగురు మూగిన గుంపుల
తలో మాటా ముచ్చట్లల్ల
నా చావుని చూద్దురుగానీ

అయినా
ఒక తెగని నమ్మకపు జీవధార

ఏ రెండు నిండు కన్నీటి బొట్లు
వలవలా రాలిపడినా
ఒక అనితర సాధ్యపు
అసంపూర్తి గమనం
ఒక్కమెట్టు ఎక్కినట్టే

8 మే 2009



సహోదరత్వం

వలస కాళ్ళ మీద నిలబడి
వగలబడీ, పగలబడీ,
గుచ్చుతున్న నవ్వు
పరుబ్బండమీద పట్టిన పాకురు లెక్కనే
జారించి, పడగొట్టే కంతిరి బుద్ధుల నిపుణత
డేరాల రాజధాని నిడిసి,
బేరాల రాజధానికి, కొండెంగల సాలుగ
ముంచే గిరాకీల ఆకర్షణలతో

మాటవేసి, కాటేయటం
కన్నేసి, కబ్జా చేయటం
అడుగేసి, అడుగంటించటం

ఒప్పందాల ఒప్పుకోల్ల
ఉల్లంలేని ఉల్లం'ఘనులై'
అరవై తొమ్మిది గోబ్యాక్ నుంచీ

ఇరవై పది విడిపోయి, కలిసుందాం దాకా
రణ నినాద కంఠజ్వాలలు
ఎగసెగసీ, అలసి, సొలసీ,
రాలిపోతున్నయి
సూసైడ్ నోట్ పుటల పైన
ఇంకా
లెస్స తెలుగక్షరాల నడుమ
గోడలు కడుతున్నట్లే, లైవ్‌తో తిరకాసు గోల

అ అంటే అమలాపురాల,
అలంకారాల యాస, ప్రాస తప్ప
మా నల్లగ్గొట్టబడిన ఆకాంక్షల మోటరాగం,
మీ చెవుల్ల గోడుగోడుగ మోగిందే లేదు
చిదంబరం అంబరం మూటని
మా ముంగిట్ల దింపిండో లేదో
తడియారని 'కలల ముద్ద' అని చూడకుండ
చిదంబర రహస్యంగ
భ్రమ్మపీచు పదార్థంగ మార్చడం
తెలుగు తల్లి ముద్దు బిడ్డల
సహోదరత్వ సల్లక్షణం కామోసు !

తెలుగులో తెలంగాణ
మట్టిగవ్వలా మెరిసినా
తామరాకు తెలుగుపత్రంపై కుదరుగ్గ
ఒదగదాయె
తెలంగాణలో తెలుగు
వానచుక్క తీర్గ దోసిట్ల పట్టుకొని
పుక్కిట్ల దాసుకున్నం

పండుగ పబ్బాల్నాడు సుత పలకరిస్తూ
పరమాన్నానికైనా రారు
పెద్దముత్తయిదువ బతుకమ్మకు
బహుమతిగ ఒక్క బంతిపువ్వైనా ఇయ్యరు

సజీవ వృత్తుల జీవన సంస్కృతిల
కళాత్మక సంలీనంగ
అలై బలై బతుకుల
అల్లుకుపోయిన మాధు'ర్యాత్మ'కంగ
చెరువ సొంటి మనసుల
భావనా, బంధ మిళితామృత గానంగ
ఎన్నడన్న ఉన్నారన్న

అంతా ఆగమాగంగా
యాభై యారేళ్ళ అపవిత్ర పొత్తుల విద్రోహ దినంగా

ఇగసాల్లే
గీ కాలం పొద్దు
మా ఎనక నడిచొచ్చిన యాల్ల
కలవని చేతులల్ల
మెత్తని ఆలింగనం పువ్వై విచ్చుకునేతందుకు
మాక్కొంచెం
మనసన్న మిగిలించుండ్రి

10 జూలై 2011



అసంపూర్తి వాక్యం

జారిపోతున్న
మలిగిపోతున్న
వెనుకడుగు వేస్తున్న నడకల ప్రయాణంల
నిన్ను చేరేదెట్ల ?

నీ శుభోదయపు లేతాకు కదలిక లాంటి పిలుపుని
అర్థరాత్రి గాఢ నిద్రలోంచి, మేల్కొని
ఎగిసిపడే అలమీద కిరణాక్షరాలుగా ముద్రించుకున్న
సముద్రపు ఒడ్డున దొరికిన గవ్వలతో
ఇసుకలో నీ పేరును
పేర్చడం, చెరిపేయడం, మళ్ళా పేర్చడం
నాకిష్టమైన వృత్తి
నువ్వు వదిలి వెళ్ళిన కనురెప్పల కిందటి
ప్రాసంగిక చూపులు
మా ఇంటికి నీ బొమ్మలున్న తోరణాలై
వచ్చే పోయే వారిని గలగలా పలకరిస్తనే వున్నయి

అల్లరి కొట్లాటలో విరిగిన పాళీని
అతికించి ఇచ్చావుగా
ఇంట్లోని ప్రతి వస్తువూ
కవిత్వ వీరంగమై పరవళ్ళు తొక్కుతున్నది

ఎంత దూరంగా వున్నావో మిత్రమా

మనసును కుదురుగా నిలిపిన క్షణం
ఆకాశంలా నాలో నిండిపోయి
చుక్కల గిలిగింతలు పెడతవు
నిప్పులాంటి వియోగబాధని
గుప్పిళ్ళ కొద్దీ వెన్నెల గజళ్ళని చల్లి ఆర్పేస్తవు
ఏ పుస్తకం తెరిచినా
తడి అయిన పేజీలతో బరువెక్కిన వాడివి
నీతో పంచుకున్న కాలం
ఋతు ధర్మాల్ని తన్నేసింది
చూశావా – నువ్వులేవని !

దౌడు తీస్తున్న రేస్ గుఱ్ఱంలా ఈ లోకం
పసిబుగ్గలపై గిట్టల తొక్కిళ్ళు
మట్టి మాధుర్యాలను, మహిమలను
దుమ్ము, ధూళిలో కలిపేసిన
పరుగుల పోటీ వేడుక
పొయ్యిమీది కుండలోకి
సూర్యుడు తొంగి చూస్తలేడు

ఈదురు గాడ్పుల తుఫాను హోరులో
ఈ నేల మీద నువ్వు రాసిన
హిమోన్నత వాక్యం పూర్తి కాలేదు

ప్రపంచానికి బాకీపడ్డ నీ సంవేదన
ఒక సందేశ స్వీకారమే

గగనంలో సుడిగాలిలా విహరిస్తున్న దుష్టరెక్కల గద్ద
కొమ్మకొసన రెక్కలల్లార్చుకుంటూ
కూచోడానికి తిప్పలు పడుతున్న పక్షిపిల్ల
నా కండ్ల వద్ద ప్రతిసారీ
నీ ఆగిన చేతివేళ్ళ కంటుకున్న బాకీరాతల్ని చూసి,
నా ముఖం కన్నీళ్ళు తుడుచుకుంటది

నెచ్చెలికాడా
నిన్నెప్పుడయినా తప్పక కలుస్తా

ఆ అర్హత,
ఆ నమ్మకం
నువ్వు విడిచి వెళ్ళిన
ఆ అసంపూర్తి వాక్యంలో వున్నది !!

4 జూన్ 2009



వినమ్ర గీతం

ప్రశ్నలు పొడుచుకొచ్చిన
మూలమలుపు సందులల్ల
చరఖా తిప్పుకుంట
చిక్కు ముడులను విప్పుతూ
బొక్క బోర్లా బడ్డ జాగలల్ల
అసిధారావ్రతపు ఆత్మగౌరవ సిద్ధాంత పుటలకు
పుటం పెడుతూ
అస్తిత్వ వేదనా తీగమీద
వలపోతల అడుగులతో
ఉద్యమ దిశాలోచనా నెగళ్ళను పూయిస్తూ
వాకిండ్లల్ల
అస్తిత్తకాంక్షల సూర్యోదయం వొంపి
తెలంగాణ ముగ్గులా వర్ధిల్లుతూ

మూడు మార్గాల సమరశీలత్వానికి
ముక్కుసూటైన బాటే

కర్తగా
తెలంగాణ సుదీర్ఘ వాక్యం అంతటా
అడ్డనుకున్న భర్త స్థానం
నిస్సారమైన ఖాళీగనే
న్యాయబద్ధ విశ్వాసపు వెలుగుల్ని
తొణకని నిండు విగ్రహానివై మోస్తూ,
నమ్మకపు అమృతధారల్తో తడిపిన సభలు

నాల్గుతరాల సహవాసపు తలరాతల్ని
గర్భీకరించుకున్న ఆగర్భ అక్షరం
శ్యామవర్ణపు స్వప్న రెక్క
నిలువు నిస్తారపు గుండ్రటి చిత్రరాజసం
సమైక్యపోల్లకే కాక
తెలంగాణోల్లక్కూడ
గావరయ్యేటంత
ధర్మదీక్షా బద్దతా బాంధవ్య చింతన

అందుకోసరమే పెద్ద సారూ....
ఇంకా మీ చితికాడ్నే నిల్చున్నం
చిటపట మంటల జ్వాలా మాలికల్లోంచి
'తెలంగాణ వస్తుందనే' అంటున్నరు

సంబురపడాల్నా ...

28 జూన్ 2011



నాటకేషు

కావ్యేషు నాటకం రమ్యం...

వెలిసిపోయిన మాట
దయనీయం, భయానకం
రాజకీయ గ్రహణోత్సవమ్
అని పూరించాలేమో

తెరలేచి చాలా కాలమైంది

ఐదేళ్ళ మజిలీలను బొచ్చుకుక్కలా వెంట తిప్పుకుంటూ
నాటకం మొదలెట్టి చాలా కాలమే అయ్యింది
వర్ధమాన నాటకానికి
మహా తిట్టు లేదా
వాంతొచ్చే పదమేదైనా పెట్టుకోవచ్చు
స్క్రిప్టంతా
చాణక్య చేతిలోని
చిత్రగుప్తుని గంటంతో రాసినట్టే వుంటది

వేటు వేసినా
కోటను దోచినా
చట్టం దేవతకు నమస్కరించే

భారీ డైలాగుల ముందు
కంటి చూపులేపాటి ?
పదవుల నోట్లోంచి జర్రున జారిపడి
మీడియా ముంగట
సిగ్గులేని మొహంతో తేలడం
సాయంత్రమయ్యేసరికి
ఒళ్ళో సరాగాలై వాలే పబ్‌ల మీదుగా
తలాపుకు వేలాడే వేట కొడవళ్ళ మీదుగా
కటాక్షించే తారకమంత్ర ముక్తి పదమ్ముల మీదుగా
బ్యాగ్రౌండ్ మ్యూజిక్ వీనులను కుద్తూ వుంటది

పాత్రలన్నీ అరచేతి క్షేత్రంలోనే
గుండ్రంగా తిరుగుతయి
జల నురగల్లో
మేఘ మధన మాలికల్లో
'వలయు చోట కావలయు' నట్టుండే
హోం క్రీ నీడల్లో,
రూపాయి రాకడ పోకడల్లో
సందు జూచి వాతలు గుంజే
ధర్మ సూక్ష్మాల పల్లవిలో
మరొక్క వెలుగు వెలిగేటందుకు వేదిక సిద్ధమైంది

సన్నివేశాలన్నీ
ఆజానుబాహుడి మాయోపాయ పాదచ్ఛాయల కింద

పీలికలుగా చెదిరిపోతున్న దృశ్యపరంపరలే
అంకములు, ఎపిసోడ్లు
ఫాస్ట్, రివైండ్ మెథడ్‌లో ఫిక్సయి
తెరపైన ఒకే బొమ్మ కదుల్తూ
రాజసంగా, భస్మాసుర హస్తం గాల్లో వూగుతూ
ముద్దుల కాట్లు విసురుతూ –

జ్యోతి ప్రజ్వలనంతో
చమురింకి పోయినంక
దీపం మాడి, నల్లని వత్తై ఆకలి మిగిలినంక
దుమ్ము దులుపుకొని
అంతా లేచే వేళకి
తాళాలు గొట్టుకుంటూ
వంధి మాగధులు భరతవాక్యం పాడుతుండగ
చివ్వరి హస్తాక్షరాల మెరుపుల
రాజముద్ర సంతకం పూర్తయితది

శూన్యావరణాన్ని సూచిస్తూ
తెర జారుతుండగ
గుమ్మం కూలిన ఇంటివైపు మరలుతూ
కడుపుబ్బ నవ్వుకుంటవో
కంటినిండా ఏడ్చుకుంటవో
ప్రేక్షకా
ఓటుని వజ్రాయుధమని
నమ్మనందులకు

01 ఆగస్టు 2009



మిలియన్ మార్చింగ్ సాంగ్

"విగ్రహాలు మీవి
శవాలు మావి"
అన్న కవి ధర్మాగ్రహ ప్రకటన
తథాగతుని అభయ ముద్ర నీడలో గెలిచే తీరింది

నాలుగు దిక్కుల
సర్కారు పళ్ళ బిగువున
రహదారుల్ని బంధించినా
చట్టాల చట్టుబండల్ని పలుగ జీరి,
ట్యాంకు బండంతా
తెలంగాణ అలుగై పారింది
ఊహలెన్ని పుడ్తున్నయో
ఉద్యమరూపాలన్ని పుడ్తున్నయి
గిప్పుడు

చీకి, శిథిలమై
నూకలు చెల్లిన అసెంబ్లీ
మాసికాని కాడి కొచ్చినం
మా వాకిట్ల బొడ్డెమ్మ పెట్టుకోడానికి,
ట్యాంక్ బండ్ చెరువు కట్టమీద
బతుకమ్మ పాట పాడుకోడానికి
అనుమతి నియ్యని నీ మతిలేని తనాన్ని
విధ్వంసం చేసిన
ధ్వంస రచనగా చదువుకో

మా మట్టిల ఘూర్ణిల్లుతున్న
మా మూలుగులు
మరో ప్రపంచంలో ఏ ప్రస్థానం చేరలే
చాపకూడుతో సమతను నేర్పి వుండొచ్చు
మన మధ్య మమతానుబంధాన్ని
ఒక్క విస్తరాకు వేసి తినిపించలేదు గద
ఊహలకే పుట్టినిల్లైన కవి
ఊహా చిత్రమే దొరకక
అబద్ధమైన ఆదికవి నన్నయ
అక్కడెట్ల భీష్మించుకు కూచున్నడో
గబ్బిలం సాక్షిగ
ఎగబడ్డ
ముప్పది మూడుకోట్ల దేవతల్లో
ఈ జగడంగాండ్లను కూడా కలిపితే,
అచ్చు అంటరానివాళ్ళ తీర్గనే
తెలంగాణను పీక్కుతిన్న సందేశం
లోకానికి ఇంకా బలంగా అంది ఉండేది

ఇచ్చుకపోయిన పొత్తుల
ధర్మయుద్ధానికి
నాలుగక్షరాల సెగ తోడంటించాలని ఆశించడం
ఐక్యరాజ్యసమితిని కూల్చేసే కుట్ర గాదే
సోదరమైత్రీ బంధంల
పాకులాడడం ఒక హక్కే
ప్రాంతపు మట్టిల
పరిమళించడం, దుఃఖించడం
తనదైన ప్రాథమిక స్పృహలో, స్ఫురణలో వున్నట్టు
అక్షరం ఎల్లలు దాటాలె
కాలికింది మట్టిని, బొట్టు పెట్టుకునే

కూల్చిన విగ్రహాలనే
తిర్లేసి, మర్లేసి
మల్లమల్ల కూలుస్తున్నట్టు చూపుతున్నరు గని
అర్ధశతాబ్దంగా మంటబెట్టిన
మా అస్తిత్వ ఘోషలకు
మీ వెన్నుపూసలు ఇప్పటికీ కరుగకపాయె
విగ్రహాల విధ్వంసం
ఒక క్రమాగత హెచ్చరికా
పర్యవసాన క్రోధాగ్ని ఘటనే
కొమురం భీం, పొనగంటి తెలగన, కాళోజీ
అక్షరబద్ధమే మా కర్తవ్య దీక్ష
మట్టి మూర్తులందరినీ
ఆవాహన జేసుకుందాం

ఈ మట్టిమీద
మన మనసుల నిండా
మహా కవీ!
నువ్వైనా, నేనైనా
నేల విడిచి రాసిన అక్షరం
జన సమ్మతం కాదని
రుజువైంది గదా ఈ క్షణాన

మతిల బెట్టుకుందాం

18 మార్చి 2011



దిగులు చూరుకు

ఆకాశం పాటల
చుక్క తెగిన రాగం
వెయ్యికాళ్ళ రాగిచెట్టు భూతం నీడన
రెక్కలు, రెప్పలు వాల్చక
ముదురు కునుకు తీయని పిచ్చుకలు
దారాన్ని మరిచి, ఎగరేసిన పతంగి
యాదికి రాని గమ్యాల అగమ్యాలలో చెక్కర్లు కొడుతూ
కలల పొదుగును నింపుకున్న మట్టి గురిగి
కనురెప్పల మీంచి జర్రున జారిపడ్డది

పన్గడి లేని దొడ్డిల
పసురాల గిట్టల్ని లెక్క బెడుతున్న
ఎన్నోసారో
ఆకులు రాలుతున్న క్షణాల్ని లెక్కరాస్తున్న
మెడకురేసి
గిర్ర గిర్ర తిప్పినప్పుడు

బంగారి పురుగు ఎన్నిసార్లు
శోక విజ్ఞప్తులు విన్పించిందో
అతని అద్భుత ప్రసంగం తర్వాత
సభాప్రాంగణంలో మెట్లు దిగుతూ
రాలిపడ్డ అతని కనుగుడ్ల మీంచే
దబదబా నడిచెళ్ళినారందరూ
రెండు గీతల్నిండా ప్రవహిస్తున్న వాక్యం
బుడగలు బుడగలుగా చిట్లిపోతూ,
కలం సహనానికి
కాలం పరీక్ష పెడుతూ
చెయ్యెత్తి నిలవడ్డ కాంస్య విగ్రహానికి
వేసిన పూలమాలలో
ఎన్నెన్ని ఆకాంక్షలు ఓడి, నేల రాలినయో

మూల మలుపుల
ఎదురైన నన్నిష్టపడ్డవాడు
పోరు బీజాలు నాటుదామని
మరో మలుపుల దిష్టిబొమ్మగ తగులబడ్డడు
సిద్ధార్థుని ఒడిలో గాయపడిన హంస
ఇంకా కునారిల్లుతనే వుంది
కర్ణ భారతం
శాపాల ముప్పేట దాడిలో
ఒరిగిపోతున్న విలువల్ని
ఒక్కటొక్కటి నిలబెట్టుకునే ప్రయత్నంల
చివ్వరి రక్తం బొట్టుని సమర్పించుకొంటూ

గట్లగట్లనే అయినా
నేనింక
మిగుల దిగులు చూరుకు ఊగులాడుతూ
జోరుగ కురుస్తున్న వానల
అనేక పాయల బాధల్ని
ఏకం చేయటానికి
గూనపెంకల వానధారల్తో కుడుతున్న

15 అక్టోబర్ 2011



వి'రణమే'

ఉద్యమకారుడా
పురోగామిపథికుడా
బెంగటీలకు
అమ్ముల పొదిలో అస్త్రబల మదుగంటిందని
ఈతచాపల ఎల్లెల్కల పండుకొని,
జరుగని పొద్దోలే దుఃఖించకు
రైలు ప్రయాణంల
పక్కనుంచి పారిపోయి
మళ్ళా ముందుకొచ్చి
ఎదురుపడే దమ్ములేనివి
వికల పరాజిత అనుభవాలే అనుకోవాలె

అందుకొని, అలుముకునేది
ముందు చూపుల్లోనే తేలియాడే
ఆకుపచ్చ హరివిల్లన్నది నిజమే గద
అడుగులు ఎన్నైనా సరే

అరుగని పాదాలున్నయి
కర్రలు తింపలేవా
కండల్లో అణుస్ఫోరక రక్తఝురీ వురుకుతున్నది
జంబి పంచినా
ఐదూళ్ళ రాజ్యమైనా ఇయ్యని కౌరవాంధ్ర రాజకీయానికి
తల అవనతం చేసి చెంచరిల్లకు
తెలంగాణ గీతమై ఊరడిల్లు

పొదరిండ్ల విద్రోహాల సమయం
పొంచే వుంటది
ముందు వెనకాల
రెండు తలల నాగుంబాము బుస కొడుతుంటది
చెరువు నిండే యాల్లకు
గలమ నెవలో తన్నుకు పోయింద్రు
కాసే పూసే మామిడి తోటను
బ్యారగాండ్లు కొనేసింద్రు

తెలంగాణ సమాజం అలిగింది
ప్రభుత్వానికి చేతులు కాలినై
అందుకే తాటాకు చప్పుళ్ళ తుపాకులు పట్టింది
కుందేళ్ళ గుంపు ఎదురుగాడ్పుల
వేటగానికి పట్టువడదు
నల్లచీమల బారు
చిమ్మ చీకట్లనైన
రాష్ట్రం కోట నెక్కే తీరుతయి
నొప్పిని తడుముకునేందుకైనా
విరామముండాలె
నెత్తురొలకవచ్చు

గమ్యానికి రక్తమంటది
ఆశ తూలనూవచ్చు
పరుగుకు మజిలీ ఎదురొస్తది
సకలం బంద్ దిమ్మీస శబ్దంతో
మహానిశ్శబ్దం పట్టన పలిగింది
పావులైతే కదులుతున్నయి
ప్రకటన ముస్తాబవుతున్నదని నమ్ముదాం

ఈ తాపకూడా
తొండి కొండి కుట్టిందో
ఆఖరికొచ్చిన పచ్చీసాటల
సంపుడు పంజం చేసైనా సరే
మనకాయ ఇంట్ల పడాలె

మరచినవా యోధుడా
మానవాస్త్రాన్ని

29 నంబవర్ 2011